# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 185 | హైదరాబాద్ | ఆదివారం 11-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

మాటలతో వినకపోతే బలప్రయోగమే..
గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటాం: ట్రంప్

## మియాపూర్ లో రూ.3 వేల కోట్లకు పైగా
# విలువైన భూమికి హైడ్రా రక్షణ

- మియాపూర్‌లో రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం
- సర్వే నంబర్ 44లో 15 ఎకరాలకు పైగా భూమిని కాపాడిన హైడ్రా
- తప్పుడు పత్రాలతో కబ్జాకు యత్నించినట్లు అధికారుల నిర్ధారణ
- ఆక్రమణల తొలగింపు.. భూమి చుట్టూ ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు
- కబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

11లో





## నారా భువనేశ్వరికి
# మరో విశిష్ట పురస్కారం..

- నారా భువనేశ్వరికి 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్' అవార్డు
- మహిళా సాధికారతకు చేస్తున్న సేవలకు ప్రశంసలు
- భువనేశ్వరి కృషి స్ఫూర్తిదాయకమన్న సీఎం చంద్రబాబు
- ఈ గౌరవం పాడి రైతులకే చెందుతుందన్న భువనేశ్వరి

11లో



11లో

## అయోధ్యలో కఠిన నిబంధనలు..
# నాన్-వెజ్ ఫుడ్ డెలివరీపై నిషేధం

- అయోధ్య రామ మందిరం పరిధిలో నాన్-వెజ్ ఫుడ్ డెలివరీపై నిషేధం
- ఆలయానికి 15 కిలోమీటర్ల పరిధిలో ఆన్‌లైన్ డెలివరీపై ఆంక్షలు
- పంచకోశి పరిక్రమ మార్గంలో ఫిర్యాదులు రావడంతో అధికారుల నిర్ణయం
- హోటళ్లలో మాంసాహారం, మద్యం అమ్మకాలపై కూడా తీవ్ర హెచ్చరికలు

## శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్..
# పనుల తీరుపై మంత్రి నారా లోకేశ్ స్పందన

- శ్రీసిటీలో రూ.5,000 కోట్లతో ఎల్జీ భారీ ప్లాంట్ ఏర్పాటు
- పనులు శరవేగంగా సాగుతున్నాయంటూ మంత్రి లోకేశ్ ట్వీట్
- భారత్‌లో ఎల్జీకి ఇది మూడో తయారీ యూనిట్
- 2026 చివరికల్లా ఉత్పత్తి ప్రారంభం, వేల మందికి ఉద్యోగాలు
- శ్రీసిటీ ఎల్జీ ప్లాంట్ లో ఫ్రిజ్ లు ఏసీలు, వాషింగ్ మెషీన్ల తయారీ



11లో



11లో

## ఒడిశాలో కూలిపోయిన
# చార్టర్డ్ విమానం

- రూర్కెలా నుండి భువనేశ్వర్‌కు వెళుతున్న చార్టర్డ్ విమానం
- పైలట్ సహా ఏడుగురు ప్రయాణికులు ఉండగా కూలిన చార్టర్డ్
- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు

## జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే
# ఇలాంటి ప్రచారం చేయరు



11లో

- మీడియాతో సీఎం చంద్రబాబు చిట్ చాట్
- జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదులపై దుష్ప్రచారం చేయరని వ్యాఖ్యలు
- రెండు తెలుగు రాష్ట్రాలు నీటి కోసం గొడవ పడొద్దన్న చంద్రబాబు
- పట్టిసీమతోనే రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి చెందిందని వెల్లడి
- గత ప్రభుత్వం రూ.900 కోట్ల బిల్లులు చేసుకుందని ఆరోపణ
- రాజధానిపై వైసీపీ ఇంకా విషం చిమ్ముతోందని విమర్శ

## టికెట్ ధరలు..
# అడ్డగోలుగా పెంచితే కఠిన చర్యలు

### ప్రైవేట్ ట్రావెల్స్ కు ఏపీ రవాణా శాఖ వార్నింగ్





11లో

- ఆర్టీసీ ధరల కన్నా 50 శాతం వరకు పెంచుకోవచ్చని వెల్లడి
- అంతకుమించి వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- బస్సులలో రవాణాశాఖ హెల్ప్‌లైన్ నంబరు డిస్‌ప్లే చేయాలని ఆదేశాలు

భారతశక్తి

# కాలుష్య కట్టడి ఎలా...

ముంబై నగర వాయు కాలుష్య సంక్షోభంపై బాంబే హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడానికి ప్రధాన కారణం డేటా లేకపోవడం . నిబంధనల అమలు లో వైఫల్యమేనని స్పష్టమవుతోంది. గాలి నాణ్యత క్షీణతకు, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొనడం అందరి దృష్టిపథంలో ఉంది. అదే సమయంలో అసలు దానికి సంబంధం ఉందో లేదో నిర్ధారించే డేటా సేకరణ మాత్రం జరగలేదు. అది యాధృచ్ఛికమో.. లేక నిజంగానే కనెక్షన్ ఉందో తెలీదు కానీ.. ప్రభుత్వం " గాలి కాలుష్యకారకమైన వ్యాధులపై పోరాటానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం.." అని చెబుతూ ఉంటుంది. సెన్సార్లు పనిచేయకపోవడం అన్నది గాలి కాలుష్యం విషయానికి సంబంధించిన ఆందోళనలో ఒక పరిపాటిగా మారిపోయింది. కాలుష్య నియంత్రణ సెన్సార్లు అనేకచోట్ల పని చేయడం లేదని బాంబే హైకోర్టు స్వయంగా గుర్తించింది. నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నివారణ మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక డేటా అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తున్నా, జనం అనుభవిస్తున్న కాలుష్యం మాత్రం వేరే కథ చెబుతోంది. జనసాంద్రతకు అనుగుణంగా సెన్సార్ నెట్‌వర్క్ లేకపోవడంతో, కోర్టులు కూడా సరైన సమాచారం లేని శూన్య స్థితిలో నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది.పాండమిక్ తర్వాత మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సంక్షోభం వాయు కాలుష్యమే అయినప్పటికీ, దీనిపై తగినంత శ్రద్ధ లేకపోవడం విచారకరం. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో శ్వాస పీల్చడం అంటే రోజుకు పదుల సంఖ్యలో సిగరెట్లు తాగడంతో సమానమని వార్తలు వస్తున్నా, జనం దాన్ని అలవోకగా తీసుకుంటున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యే కాదు, పెరుగుతున్న వైద్య ఖర్చుల వల్ల దేశంపై భారీ ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ముక్కలు ముక్కలుగా ఉన్న నిబంధనలు, ఆచరణకు సాధ్యం కాని విధానాల వల్ల వాయు స్వచ్ఛత లక్ష్యాలు నెరవేరడం లేదు.ఈ పరిస్థితికి చాలా కారణాలున్నాయి. సరైన నియంత్రణలు లేకపోవడం...వాటిని అమలు చేయడంలో సమన్వయ లోపం, ఆశావహ విధానాలు లేకపోవడం.. వాస్తవికత ఆధారంగా పనిచేయకపోవడం ఇవన్నీ కారణాలే. స్వచ్ఛమైన గాలి కోసం మనం విధించుకునే లక్ష్యాలు..వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతుల్యం కూడా అవసరమే. నా దృష్టిలో, ఇవన్నీ రెండు ప్రధాన లోపాలున్నాయి. ఒకటి డేటా లేకపోవడం.. అదే ముఖ్యమైంది. ఇక రెండోది ప్రత్యక్ష ఆర్థిక ప్రోత్సాహకాలు, జరిమానాలు లేకపోవడం. (కాలుష్య నియంత్రణకు సంబంధించి) ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఇతర కారణాలు సహా మిగతా అన్ని అంశాలు..ఈ మొదటి లోపాన్ని సరిదిద్దకుండా పరిష్కరించలేము.కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి వార్డులో, ప్రతి లోకాలిటీలో తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక సెన్సార్లను ఏర్పాటు చేయాలి. కేవలం ముంబైని మాత్రమే కాకుండా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ మొత్తాన్ని ఒకే 'ఎయిర్ షెడ్'గా పరిగణించి అధ్యయనం చేయాలి. సముద్రపు గాలుల వల్ల కాలుష్యం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుతుందో తెలిస్తేనే మూలాలను అరికట్టగలం. 2023లో ఎమి బాంబే, ఔఇఖీఎ వంటి సంస్థలు ఇచ్చిన నివేదికలను ఇప్పటికైనా అమలు చేయాలి. వీటితో పాటు, కాలుష్యం తగ్గించే వారికి పన్ను రాయితీలు ఇవ్వడం, ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం వంటి 'ఫిస్కల్ ఇన్సెంటివ్స్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. బలమైన రాజకీయ సంకల్పం లేకపోతే, మనం పీల్చే గాలిని చూస్తూ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోతాం.శ రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరోవైపు ప్రపంచానికే పొగమంచు రాజధానిగా పేరుపొందిన చైనా రాజధాని బీజింగ్ గడచిన దశాబ్ద కాలంలో వాయు నాణ్యతను గణనీయ స్థాయిలో మెరుగుపరుచుకుంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ఈ గండం నుంచి గట్టెక్కడానికి చైనీస్ ఎంబసీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న దరిమిలా ఉత్పన్నమయ్యే వాయు కాలుష్యంపైన ఎలా పోరాడాలో భారత్, చైనాకు తెలుసునని చైనీస్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి రాత్రికి రాత్రే రాదని, కాని దాన్ని సాధించగలమని ఆమె తెలిపారు. డిసెంబర్ 15న ఢిల్లీలో వాయు ప్రమాణ సూచి(ఏక్యూ) 447 ఉండగా బీజింగ్‌లో 67 పాయింట్లు ఉంది. ఈ రెండు స్క్రీన్‌షాట్లను ఆమె తన పోస్టులో షేర్ చేశారు.మొదటి దశలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు బీజింగ్ తీసుకున్న చర్యలను ఆమె వివరిస్తూ ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లే పాత వాహనాలను తొలగించి యూరో 6 నిబంధనలను కఠినంగా అమలు చేసినట్లు ఆమె చెప్పారు. లైసెన్స్-ప్లేట్ లాటరీలు, బేసి, సరి సంఖ్య తేదీల్లో వాహనాలపై ఆంక్షలు, మెట్రో, ప్రజారవాణా వ్యవస్థలో భారీ పెట్టుబడులు పెట్టడం, విద్యుత్తు బస్సులు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున తీసుకురావడం వంటి చర్యలను ఆమె సూచించారు.రెండవ దశలో పారిశ్రామిక పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. బీజింగ్‌లో 3,000కు పైగా భారీ పరిశ్రమల మూసివేత లేక వేరే ప్రాంతాలకు తరలింపు జరిగినట్లు చెప్పారు. చైనాలోని అతి పెద్ద ఉక్కు తయారీ సంస్థల్లో ఒకటైన షౌగాంగ్‌ని వేరే చోటుకు తరలించడంతో 20 శాతం వాయు కాలుష్యం తగ్గినట్లు వివరించారు. ఖాళీ చేసిన ఫ్యాక్టరీల స్థలాలను పార్కులు, వాణిజ్య జోన్లు, టెక్ హబ్‌లుగా మార్చాలని ఆమె సూచించారు.

# వైసీపీలో అమరావతి రచ్చ

అమరావతి, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

ఏపీ రాజధాని. కోటాది మంది ఆంధ్రుల ఆశల నగరం..అమరావతి చుట్టే ఏపీ రాజకీయం. అప్పటి నుంచి అదే చర్చ. ఇప్పటికీ అదే రచ్చ. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన కామెంట్స్..మరోసారి



అమరావతిపై హాట్ డిబేట్‌కు దారితీశాయి. ఏపీ రాజధాని ప్రాంతంగా అమరావతి అనుకూలమైంది కాదన్న జగన్..రాజధానికి మౌలిక సదుపాయాల కొరత ఉందని అన్నారు. లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అని కూడా చెప్పుకొచ్చారు.రాజధాని పేరుతో చంద్రబాబు వేలాది ఎకరాల సేకరణ పేరుతో చేస్తున్నది సరైందని కాదని కూడా జగన్ హాట్ కామెంట్స్ చేశారు. సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మరోసారి రాజధాని అంశాన్ని గెలకడంతో అమరావతి విషయంలో మళ్లీ చర్చ నడుస్తోంది. జగన్ వ్యాఖ్యలు కాస్త పొలిటికల్ డైలాగ్‌వార్‌కు దారితీశాయ్. సీఎం చంద్రబాబుతో సహా మంత్రి నారాయణ..వైసీపీ అధినేత వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడంతో కాక మొదలైంది.అమరావతి రాజధాని విషయంలో వైసీపీ ఆలోచనలు మారుతున్నాయా? లేక మూడు రాజధానుల లైన్‌కే కట్టుబడి ఉన్నారా అనే చర్చ జరుగుతోంది. ఒక్కోసారి ఒక్కో తీరుగా వైసీపీ నేతలు స్పందిస్తున్న తీరు గందరగోళానికి దారితీస్తోందని మండిపడుతున్నాయి కూటమి పార్టీలు. ఓసారి మూడు రాజధానుల ముచ్చటే లేదంటారు. మరోసారి సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటారు. అమరావతే రాజధాని కానీ..విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే డెవలప్‌మెంట్‌కు స్కోప్ ఉంటుందని మరో వైసీపీ నేత వాయిస్ వినిపిస్తుంటారు.ఇంతకు ఏపీ రాజధాని అమరావతిపై వైసీపీ స్టాండ్ ఏంటో క్లారిటీ ఇవ్వాలని..జగన్ మాటల్లో కూడా ఈ క్లారిటీ మిస్ అయిందని అంటున్నారు. రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని వ్యతిరేకిస్తున్నారా? రాజధాని నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలను ప్రస్తావిస్తున్నారా? లేక మూడు రాజధానుల నినాదానికే కట్టుబడి ఉన్నారా? ఇదేది స్పష్టత లేదని అంటోంది టీడీపీ. ఓవైపు రాజధాని రైతుల సమస్యలను ప్రస్తావిస్తారు..మరోవైపు లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అంటారు. ఇంతకు జగన్ ఉద్దేశమేంటనేది ఎవరికి అంతు చిక్కడం లేదంటున్నారు టీడీపీ నేతలు. ఏపీకి అంటూ ఓ రాజధాని ఉండాలని ప్రజలు కోరుకుంటుంటే..జగన్ మాత్రం ఏదో ఒక ట్విస్ట్ ఇస్తూ చర్చకు..రచ్చకు ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు.ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా..అమరావతి రైతుల కోరిక ప్రకారం రాజధానికి చట్టబద్ధత కోసం..గెజిట్ తెచ్చేందుకు ఏపీ సర్కార్ ప్రయత్నిస్తోంది. ఇలాంటి టైమ్‌లో మాజీ సీఎం జగన్ మరోసారి కన్‌ఫ్యూజన్ క్రియేట్ చేసేలా..మాట్లాడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు టీడీపీ నేతలు. మూడు రాజధానుల నినాదంతో ఎన్నికలకు వెళ్లిన వైసీపీ దారుణంగా ఓడిపోయిందని మర్చిపోయారా అంటూ గుర్తు చేస్తున్నారు. విశాఖ ఆర్థిక రాజధాని అంటూ ఉత్తరాంధ్రలో..కనీసం కూటమి అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వలేకపోయిందని విమర్శిస్తున్నారు.వైసీపీ ఘోర పరాజయానికి రాజధాని అంశం కూడా ప్రధాన కారణమనే విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు. గుంటూరు జిల్లా నుంచి విజయవాడ వరకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయిందని..అమరావతిని కాదనుకుని..మూడు రాజధానులు అంటూ కొత్త నివాదం ఎత్తుకోవడమే అందుకు కారణమంటూ వైసీపీపై అటాక్‌కు దిగుతున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా..ప్రజల అభిప్రాయం..ఆకాంక్షలకు విరుద్ధంగా జగన్ మాట్లాడాల్సిన తీరు ఇది కాదంటూ తప్పుబడుతోంది టీడీపీ. రాజధాని విషయంలో వైసీపీనే కన్‌ఫ్యూజన్‌లో ఉందో..లేక ప్రజలనే కన్‌ఫ్యూజన్‌లో పెట్టి..హిడెన్ ఎజెండాతో ముందుకు వెళ్తుందో తెలియదు కానీ..ఈ గందరగోళానికి చెక్ పెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్.

రైతులకు మద్దతుగా

అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన పై ఒక క్లారిటీ వస్తోంది. ఆ పార్టీకి అమరావతి రాజధాని అనేది శాపంగా మారింది. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చే క్రమంలో.. ఒక్క అమరావతి ప్రజలే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతాల ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎంత మాత్రం మార్పు కనిపించడం లేదు. గత కొద్ది రోజులుగా అమరావతి విషయంలో మళ్లీ కలుగజేసుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే అమరావతి రైతులు ఇప్పుడు భయపడుతున్నారు. రెండో విడత భూ సమీకరణకు రకరకాల షరతులు పెడుతున్నారు. అయితే దీని వెనుక ఉన్న కారణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే 2019 నుంచి 2024 మధ్య వారికి చుక్కలు చూపించింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. అందుకే ఇప్పుడు అమరావతి రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచన చేస్తున్నారు.ఇంకా కూటమి ప్రభుత్వానికి మూడేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడు తీసుకున్న భూములకు బదులు రిటర్నబుల్ ఫ్లాట్స్ అభివృద్ధి చేయాలన్నది ఈ షరతు. అలా చేయకపోతే మూడు సంవత్సరాల్లో ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే ఎన్నికలు జరుగుతాయి. పొరపాటున మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి వారికి తెలుసు. అందుకే కూటమి ప్రభుత్వం ఎదుట ఈ కీలక ప్రతిపాదన పెడుతున్నారు. ఒకటి కూటమి ప్రభుత్వానికి హెచ్చరించినట్లు అవుతుంది. ముందే జాగ్రత్త పడినట్లు అవుతుంది.అమరావతి రైతుల్లో భయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక కారణం. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ కొత్త పల్లవి అందుకుంటుంది. అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి అమరావతి రైతులకు ఎంతలా ఇబ్బంది పెట్టాలో అంతలా పెట్టారు. ఇప్పుడు రైతుల భయాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్వాన్స్ గా తీసుకుంటుంది. గత ఎన్నికల్లో ఓటమి ఎదురైన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి ప్రస్తావన తెచ్చేందుకు భయపడేది. కానీ అదనపు భూ సమీకరణకు ప్రభుత్వం దిగడంతో రైతుల నుంచి ఒక రకమైన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అయితే దానిని అసంతృప్తిగా భావిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది అసంతృప్తి కాదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై భయం అన్న విషయం మరిచిపోతోంది. అమరావతి ప్రాంత రైతులు ప్రత్యామ్నాయంగా జగన్మోహన్ రెడ్డిని చూడరు. అవసరం అనుకుంటే ఏ చిన్న పార్టీ కైనా అక్కడ అవకాశం ఇస్తారే కానీ.. అమరావతి రైతులపై ఎంత ప్రేమ వలకబోసినా వారు మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంత మాత్రం ఛాన్స్ ఇవ్వరు. ఇది ముమ్మాటికి వాస్తవం.

# ఏపీలో కారవాన్ టూరిజం ప్రారంభం.. ఎంచక్కా 4 మార్గాల్లో ప్రయాణం

విజయవాడ, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా కారవాన్ టూరిజం ప్రారంభమైంది. ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా వీటిని బుక్ చేసుకుని టీవీ, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి సదుపాయాలతో ప్రయాణించవచ్చు.మీకు కారవాన్ అనగానే సెలబ్రిటీలు, ముఖ్యంగా సినీ ప్రముఖులు గుర్తుకొస్తారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం పర్యారక రంగానికి ఊతమిచ్చేందుకు కారవాన్ టూరిజాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు కూటమి ప్రభుత్వం మొదటిసారిగా



కారవాన్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గోవాల వంటి రాష్ట్రాల తరహాలోనే ఏపీలో కూడా పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఓజీ డ్రీమ్ లైనర్స్, ఇండియా లక్సీ కారవాన్ ఒఒఖ అనే రెండు సంస్థలను ఎంప్యానల్ చేసింది. ప్రస్తుతం ఈ సంస్థలు 5, 6 సీట్లు, 10-12 సీట్ల సామర్థ్యం కలిగిన నాలుగు వాహనాలను నాలుగు ప్రధాన మార్గాల్లో నడుపుతున్నాయి. ఆసక్తి గల పర్యాటకులు వీటిని నేరుగా ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నుండి భీమవరం, దిండి వరకు ప్రత్యేకంగా 6 రోజుల ప్యాకేజీని ప్రకటించారు. ఈ ప్యాకేజీ ధర రూ.3.50 లక్షలుగా నిర్ణయించారు. జనవరి 10, 11, 12 తేదీల్లో బుకింగ్ చేసుకున్న వారికి ఆ రోజు నుండి ఆరు రోజుల పాటు ఈ ప్రయాణం సాగుతుంది. పండుగ సెలవుల్లో వినూత్నంగా ప్రయాణించాలనుకునే పర్యాటకుల కోసం హైదరాబాద్ నుండి 4 కారవాన్ వాహనాలు అందుబాటులో ఉంచారు.ఈ కారవాన్ టూరిజంలో భాగంగా పర్యాటకుల సౌకర్యార్థం సకల వసతులు కల్పించారు. పగటిపూట పర్యాటక ప్రాంతాలను సందర్శించి, రాత్రి వేళల్లో కారవాన్‌లోనే నిద్రించేలా సీట్లను పడకలుగా మార్చుకునే వీలుంటుంది. వీటిలో టీవీ, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. భోజనం కోసం పర్యాటకుల కోరిక మేరకు నచ్చిన హోటళ్ల వద్ద వాహనాన్ని ఆపుతారు. అయితే భోజన ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుంది. భద్రత దృష్ట్యా రాత్రి సమయాల్లో ఈ వాహనాలను పర్యాటక శాఖ హోటళ్లు లేదా ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల ప్రాంగణాల్లో పార్కింగ్ చేస్తారని తెలిపారు.

కారవాన్ టూరిజం నాలుగు రూట్లు ఇవే..

రూట్ 1: విశాఖపట్నం నుంచి అరకు, లంబసింగి (ఒకటిన్నర రోజు)

ప్యాకేజీ ధర 42,500 రూపాయలుగా నిర్ణయించారు (10- 12 సీట్ల కారవాన్), రూ.31,500 (5 నుంచి 6 సీట్లు)

రూట్ 2: విశాఖపట్నం నుంచి సింహాచలం, అన్నవరం, పితాపురం, ద్రాక్షారామం, సామర్లకోట, మీదుగా వాడపల్లి (ఒకటిన్నర రోజు)

ప్యాకేజీ ధర రూ.42,500 గా నిర్ణయించారు (10 నుంచి 12 సీట్ల కారవాన్), రూ.31,500 (5 నుంచి 6 సీట్లు)

రూట్ 3: హైదరాబాద్ నుంచి ఏపీలోని గండికోట (రెండు రోజుల టూర్)

ఈ ప్యాకేజీ ధర రూ.85,000 (10 నుంచి 12 సీట్లు), రూ.64,000గా (5, 6 సీట్లు) నిర్ణయించారు.

రూట్ 4: హైదరాబాద్ నుంచి సూర్యలంక (రెండు రోజులు టూర్)

10 నుంచి 12 సీట్లకు ప్యాకేజీ ధర రూ.85,000 కాగా, 5- 6 సీట్లకు రూ.64,000గా ప్రకటించారు.

ఈ కారవాన్ టూరిజం సక్సెస్ అయితే త్వరలో మరిన్ని కారవాన్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. మరిన్ని మార్గాల్లో కారవాన్ టూరిజాన్ని ప్రోత్సహించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.

=======================

# హాట్ టాపిక్ గా వైసీపీ నేతల ఆస్తులు

విజయవాడ, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

గత పదేళ్ల కాలంలో ఎంపీల ఆస్తుల్లో జరిగిన మార్పులపై ఏడీఆర్ సంస్థ చేసిన తాజా అధ్యయనం దేశ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా 2014 నుంచి 2024 వరకు వరుసగా మూడు సార్లు గెలిచిన 102 మంది ఎంపీల ఆస్తుల వివరాలను ఈ సంస్థ విశ్లేషించింది. ఈ అధ్యయనంలో అత్యంత వేగంగా ఆస్తులు పెరిగిన ఎంపీల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కీలక స్థానాల్లో నిలవడం విశేషంగా మారింది.టాప్ మూడు ఎంపీల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారే కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు, ఆ ఇద్దరూ ఒకే రాజకీయ పార్టీ అయిన వైసీపీకి చెందిన వారు కావడం మరింత ఆసక్తికర అంశం. రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మిథున్ రెడ్డి ఆస్తులు పదేళ్లలో ఏకంగా 550 శాతం పెరిగినట్లు ఏడీఆర్ వెల్లడించింది. 2014లో ఆయన ఆస్తులు సుమారు రూ.22 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.66 కోట్లకు చేరాయి. 2024లో ఇవి రూ.146 కోట్లకు పెరిగినట్లు అఫిడవిట్‌లో నమోదైంది. ఈ వేగవంతమైన పెరుగుదలతో దేశవ్యాప్తంగా అత్యధికంగా ఆస్తులు పెరిగిన ఎంపీల్లో ఆయన మూడో స్థానంలో నిలిచారు.ఇక కడప లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయి. 2014లో ఆయన ప్రకటించిన ఆస్తుల విలువ రూ.7 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.18 కోట్లకు చేరింది. 2024 ఎన్నికల సమయంలో ఇవి రూ.40 కోట్లుగా నమోదయ్యాయి. ఆస్తుల పెరుగుదల పరంగా చూస్తే ఆయన దేశంలో 15వ స్థానంలో నిలిచినట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.ఈ ఇద్దరిని మించి టాప్ స్థానంలో నిలిచిన ఎంపీ జార్ఖండ్‌కు చెందిన విజయ్ కుమార్ హన్సదక్ అని అధ్యయనం స్పష్టం చేసింది. జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీకి చెందిన ఈ నేత రాజ్ మహల్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014లో ఆయన ఆస్తులు కేవలం రూ.68.63 లక్షలుగా ఉండగా, 2024 నాటికి రూ.6 కోట్లకు పెరిగాయి. ఇది దాదాపు 804 శాతం పెరుగుదలగా ఏడీఆర్ లెక్కించింది.తెలంగాణకు చెందిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆస్తులు కూడా పదేళ్లలో 488 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో ఆయన 24వ స్థానంలో నిలిచారు. ఇక ఏపీ నుంచి టీడీపీ తరఫున గెలిచిన ఏకైక ఎంపీ, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆస్తులు 177 శాతం పెరిగాయి. పెరుగుదల పరంగా ఆయన 28వ స్థానంలో ఉన్నారు.ఇదిలా ఉండగా, ఆస్తులు తగ్గిన అరుదైన ఉదంతంగా కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ పేరు వినిపిస్తోంది. గుజరాత్‌లోని నవ్‌సారి నుంచి హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఆయన ఆస్తులు పదేళ్లలో 47 శాతం తగ్గినట్లు తేలింది. 2014లో రూ.74.47 కోట్లుగా ఉన్న ఆయన ఆస్తులు 2024 నాటికి రూ.39.49 కోట్లకు తగ్గాయి. మొత్తంగా దేశవ్యాప్తంగా ఎంపీల ఆస్తుల సగటు పెరుగుదల 110 శాతంగా ఉందని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది.

# జంగా రాజీనామా వెనుక గెస్ట్ హౌసేనా

తిరుమల, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,



తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు, సీనియర్ నేత జంగా కృష్ణమూర్తి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపారు. గత కొద్ది రోజులుగా తిరుమలలో గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం భూకేటాయింపు వ్యవహారంపై వస్తున్న ఆరోపణలు, కేబినెట్ సమావేశంలో జరిగిన చర్చల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఇటీవల ఓ దినపత్రికలో తనపై వచ్చిన కథనాలపై ముఖ్యమంత్రి వాస్తవాలను పరిశీలించకుండానే, టీటీడీ బోర్డు నిర్ణయాన్ని రద్దు చేస్తామని కేబినెట్ మీటింగ్‌లో ప్రకటించడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ వివాదానికి మూలాలు దాదాపు రెండు దశాబ్దాల క్రితం నాటివి. పల్నాడు జిల్లాకు చెందిన బలమైన బీసీ నాయకుడైన జంగా కృష్ణమూర్తి, 2005లో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తిరుమల బాలాజీ నగర్‌లో ఒక ప్లాట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో 'కాటేజీ డొనేషన్ స్కీమ్' కింద ప్లాట్ నంబర్ 2ను ఆయనకు కేటాయించినప్పటికీ, డొనేషన్ మొత్తం పది లక్షల నుంచి యాభై లక్షలకు పెరగడంతో ఆయన ఆ సొమ్ము చెల్లించలేదు. ఫలితంగా ఆ కేటాయింపు రద్దయింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021లో మళ్ళీ ప్రయత్నించగా, టీటీడీ కోటి పది లక్షలు చెల్లించాలని కోరింది. అయితే ఆ స్థలాన్ని తన వ్యక్తిగత పేరు మీద కాకుండా 'ఓం శ్రీ నమో వేంకటేశాయ గ్లోబల్ ట్రస్ట్' పేరు మీదకు మార్చాలని ఆయన కోరారు. నిబంధనల సాకుతో అప్పట్లో ఆ అభ్యర్థన తిరస్కరణకు గురైంది. అయితే, ఎన్నికల ముందు టీడీపీలో చేరిన జంగా కృష్ణమూర్తికి కూటమి ప్రభుత్వం టీటీడీ బోర్డులో చోటు కల్పించింది. బోర్డు సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే, గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తన పాత అభ్యర్థనను మళ్ళీ తెరపైకి తెచ్చారు. ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో, ప్రస్తుతం ఆ స్థలం మార్కెట్ విలువ దాదాపు 7 కోట్ల రూపాయల పైచిలుకు ఉన్నప్పటికీ, పాత ధరకే అంటే కేవలం కోటి పది లక్షలకే ఆయన ట్రస్టుకు కేటాయిస్తూ బోర్డు తీర్మానం చేసింది. ఈ నిర్ణయం బయటకు రావడంతో పెను దుమారం రేగింది. ప్రభుత్వం పారదర్శకత గురించి మాట్లాడుతుంటే, బోర్డు సభ్యులు మాత్రం తమ సొంత ప్రయోజనాల కోసం కోట్లాది రూపాయల విలువైన టీటీడీ ఆస్తులను తక్కువ ధరకు పొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ అంశంపై కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు సభ్యులుగా ఉండి ఇలాంటి వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. దీంతో అడ్డగోలుగా జరిగిన ఈ భూకేటాయింపును రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తనను వ్యక్తిగతంగా అవమానించినట్లుగా ఉందని జంగా కృష్ణమూర్తి భావించారు. తాను భక్తుల సౌకర్యార్థం ట్రస్ట్ ద్వారా సేవ చేయాలనుకున్నానని, కానీ తనపై అసత్య కథనాలు ప్రచారం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ తీసుకోకుండానే రద్దు నిర్ణయం ప్రకటించడం వల్ల ఆత్మగౌరవం దెబ్బతిందని పేర్కొంటూ ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు 2021లో మరోసారి అదే ప్లాట్‌ను ఆయనకు కేటాయించారు. అప్పట్లో కోటి రూపాయల విరాళం చెల్లించాలని టీటీడీ కోరగా, ఆయన కేవలం 10 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన మొత్తానికి గడువు కోరారు. ఆయన ఓం శ్రీ నమో వెంకటేశాయ గ్లోబల్ ట్రస్టు పేరు మీద ఆ ప్లాట్ కేటాయించాలని ఆయన కోరారు. కానీ బోర్డు తిరస్కరించింది. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక, జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరి టీటీడీ బోర్డు సభ్యుడయ్యారు. ఈ క్రమంలో, పాత విరాళం రేట్లకే అదే స్థలాన్ని ఆయన సూచించిన ట్రస్టుకు కేటాయిస్తూ బోర్డు ఇటీవల తీర్మానం చేసింది. అది వివాదాస్పదంఅయి ఉంది. ఈ వివాదం ముదురుతుండటం, ప్రభుత్వంపై విమర్శలు వస్తుండటంతో జంగా కృష్ణమూర్తి తన పదవికి రాజీనామా చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉంటూ భూమి కేటాయింపులు చేసే ఎస్టేట్ కమిటీ లో కూడా ఆయనే ఉండటం పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కిందకు వస్తుందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అందుకే ఆయన తన సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

# అసెంబ్లీలో రప్పా..రప్పా రాజకీయం



నెల్లూరు, జనవరి 1 భారతశక్తి ప్రతినిధి,

అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వనిదే సభకు హాజరుకామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. ఇప్పటికీ అదే స్టాండ్ తో ఉంది. మరోవైపు వరుసగా పని దినాలు కలుపుకొని శాసనసభకు 60 రోజులపాటు హాజరు కాకుంటే ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడే అవకాశం ఉంది. ఇప్పటికే శాసనసభ ఎథిక్స్ కమిటీ సమావేశం జరిగింది. వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరుపై చర్చించారు. ప్రభుత్వానికి నివేదించనున్నారు. స్పీకర్ ద్వారా మరోసారి నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. సాధారణంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నవంబర్ నుంచి జనవరి మధ్య జరగాలి. కానీ ఈసారి ఆలస్యం జరిగింది. ఫిబ్రవరిలో సమావేశాలు ఉంటాయని తెలుస్తోంది. దాదాపు పది రోజులపాటు సభను కొనసాగించాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈసారి కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి సమగ్రంగా వివరించనున్నారు ఈ సభ ద్వారా. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్, విశాఖలో పరిశ్రమల ఏర్పాటు, ఏపీకి భారీగా వస్తున్న ప్రాజెక్టులు, తయారీ రంగం పరిశ్రమలు.. ఇలా ప్రతి అంశం గురించి సమగ్రంగా చర్చించే వీలుగా సభలు ఉండనున్నాయి. అర్థవంతమైన చర్చకు తెర లేపనున్నారు. ముఖ్యంగా విపక్ష పాత్రను కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలు పోషించనున్నారు. ప్రజల తరఫున బలమైన వాయిస్ వినిపించి ప్రభుత్వం నుంచి సమాధానాలు రాబట్టనున్నారు. అందుకే లోతైన అధ్యయనం చేయాలని పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు. మంత్రులు కూడా సమగ్ర వివరాలతో సభకు హాజరుకావాలని ఇప్పటికే సంకేతాలు పంపించారు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన నాటికి రాష్ట్ర పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ఇచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఇటీవల పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ దేశంలోనే ప్రథమ స్థాయిలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనల్లో.. 25% ఏపీకి రావడం నిజంగా శుభపరిణామం. ఇందులో సగం పెట్టుబడులు వచ్చిన ఏపీ అభివృద్ధి సాధించినట్టే. మరోవైపు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టే ఒకవైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అడుగులు వేస్తోంది. అమరావతి రాజధానితోపాటు పోలవరం ప్రాజెక్ట్ వంటి ప్రాధాన్యతాంశాలను పూర్తిచేసేందుకు గట్టి ప్రయత్నాల్లోనే ఉంది. మొన్ననే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది. అయితే వైసీపీ నుంచి మాత్రం అంతా తామే చేసాం అన్నట్టు వాయిస్ వస్తోంది. అందుకే దాదాపు పది రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి.. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది.

============

# వారసుడు ట్యాగ్ ? ఇప్పుడు లీడర్ ముద్ర

విజయవాడ, జనవరి 10, ( భారతశక్తి ప్రతినిధి,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇస్తూ ముందుకు సాగుతున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు పొందారు. ప్రముఖ జాతీయ వారపత్రిక 'ది వీక్' మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయన నిలవడం ఇప్పుడు రాజకీయ, ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న లోకేష్‌ను 'చీఫ్ జాబ్ క్రియేటర్' గా ఆ మ్యాగజైన్ అభివర్ణించడం విశేషం. నారా లోకేష్ విద్యా నేపథ్యం, అంతర్జాతీయ అనుభవం ఆయన పనితీరులో స్పష్టంగా కనిపిస్తోందని 'ది వీక్' పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, కార్నెగీ మెలన్ యూనివర్సిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలను వేగంగా అమలు చేసే నాయకుడిగా ఎదిగారని మ్యాగజైన్ విశ్లేషించింది. పరిశ్రమలతో నేరుగా మాట్లాడటం, విధానాల్లో మార్పులు తీసుకురావటం, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా రాష్ట్రాన్ని ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా మార్చుతున్నారని తెలిపింది. ఇది తొలిసారి కాదు. గతంలో ప్రముఖ ఆర్థిక పత్రిక 'బిజినెస్ స్టాండర్డ్'కూడా నారా లోకేష్‌ను 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్'గా పేర్కొంది. ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం ? రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య కుదిరిన ఒప్పందం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం 30 రోజుల్లోనే రూ.65 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం వెనుక లోకేష్ కీలక పాత్ర ఉందని ఆ పత్రిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా నిర్వహించింది. ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి పెట్టారని జాతీయ మీడియా చెబుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల ఆమోదం, ఐటీ రంగాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు వేగంగా సాగుతున్నాయని విశ్లేషిస్తోంది. ముఖ్యంగా పెట్టుబడిదారులకు క్లియర్ పాలసీలు, వేగవంతమైన అనుమతులు ఇవ్వడం వల్ల ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి పథంలోకి వస్తోందని వ్యాఖ్యానిస్తోంది. మొత్తానికి, నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా తిరిగి నిలదొక్కుకునే దిశగా ముందుకెళ్తోందని జాతీయ మీడియా స్పష్టంగా చెబుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలే కేంద్రబిందువుగా రాష్ట్ర భవిష్యత్తు రూపుదిద్దుకుంటోందన్న అభిప్రాయం మరింత బలపడుతోంది. నారా లోకేష్ ను నాలుగైదేళ్ల కిందట వారసుడిగా మాత్రమే చూసేవాళ్లు. కానీ తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సమర్థవంతమైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే, వ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు సంచలనం సృష్టిస్తున్నాయి. అటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో, ఇటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఆయన చూపిస్తున్న చొరవతో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. లోకేష్ పనితీరు కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందుతోంది. ముఖ్యంగా 'యోగాంధ్ర' వంటి వినూత్న కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఆయన అభిమానాన్ని కూడా చూరగొన్నారు. యువ నాయకత్వంలో లోకేష్ చూపిస్తున్న పరిణతి, అంకితభావంపై ప్రధానికి ఎంతో నమ్మకం ఏర్పడటం విశేషం. ఇది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ఒక బలమైన పునాదిగా మారుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో లోకేష్ ఒక ఇండస్ట్రియల్ హీరో గా అవతరించారు. అంతర్జాతీయ కంపెనీలను ఏపీ వైపు మళ్లించడంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు భారతీయ పారిశ్రామిక రంగాన్ని అబ్బురపరుస్తున్నాయి. తాజాగా ప్రముఖ ది వీక్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయనను ప్రదర్శించడం, ఆయన పెరుగుతున్న ప్రాభవానికి నిదర్శనం. పెట్టుబడుల విషయంలో ఆయన చూపిస్తున్న వేగం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఏపీ పారిశ్రామిక హబ్‌గా మారడం ఖాయమనిపిస్తోంది. లోకేష్ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాలేదు. బీహార్ వంటి ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు అక్కడ ఆయనకు లభించిన ఆదరణ అసాధారణం. అక్కడి యువత లోకేష్‌ను ఒక రోల్ మోడల్‌గా భావించి బ్రహ్మరథం పట్టడం చూస్తుంటే, ఆయన జాతీయ స్థాయిలో ఎదగగల సత్తా ఉన్న నాయకుడని స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన, ఆధునిక సాంకేతికతపై పట్టు ఉన్న లోకేష్, నిశ్చయంగా దేశ రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగే భవిష్యత్ నాయకుడు అని ఎక్కువ మంది అంచనా వేస్తున్నారు.



==================

# భారత్ ను టార్గెట్ చేసిన ట్రంప్

న్యూఢిల్లీ, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు. వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్?300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు. వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు. ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు. అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదననాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. ట్రంప్?మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థాను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు.

==================

# స్టైలుగా చిన్నారులు.. మారని పాకిస్తాన్ వైఖరి

న్యూఢిల్లీ, జనవరి 10,పాకిస్తాన్‌కు ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోవడం లేదు. ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐతో కుట్రలు చేస్తూనే ఉంది. తాజాగా ఐఎస్ఐ కుట్రను మన భద్రతా బలగాలు గుర్తించాయి. అయితే ఇందులో అభం శుభం తెలియని 15 ఏళ్ల పిల్లలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పఠాన్‌కోట్‌లో 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. సాధారణ జీవితం గడుపుతున్న అతను రక్షణ స్థావరాలు, భద్రతా సిబ్బంది ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పంచాడు. ఈ ఘటన ఐఎస్ఐ ఆన్‌లైన్ గ్రూమింగ్ వ్యూహాన్ని బయటపెట్టింది. జమ్మూ సాంబార్ ప్రాంతం నుంచి పఠాన్‌కోట్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన ఈ అబ్బాయి వివిధ చోట్ల తిరిగి ఫొటోలు, వీడియోలు సేకరించాడు. రక్షణ శాఖ ఆఫీసులు, నివాసాలు, వాహనాలు లక్ష్యాలు. పోలీసు విచారణలో సోషల్ మీడియా గ్రూపుల్లో అజ్ఞాతుల సూచనలపై ఇలా చేశాడు. పొటోలు, వీడియోలను ఓ గ్రూపులో పోస్టు చేశాడు. బాలుడి తండ్రి చనిపోయి పేదరికంలో ఉన్నాడు. ఐఎస్ఐ ఏజెంట్లు డబ్బు పంపుతూ సమాచారం సేకరించారు. ఆన్‌లైన్ గ్రూమర్లు పిల్లలను ఆకర్షించి నేరాలకు ప్రేరేపిస్తారు. ఇలాంటి బాలురు ఐఎస్ఐకి మిలిటరీ కదలికలు, ఆయుధాల వివరాలు సరఫరా చేస్తున్నారు. పఠాన్‌కోట్ ఎయిర్ బేస్, సరిహద్దు రక్షణ వ్యవస్థలు కీలకం. 2016 జైష్ దాడి ఇక్కడే జరిగింది. అంబాలాలో ప్రైవేటు ఉద్యోగిని అరెస్టు చేశారు. మిలిటరీ పాస్‌తో లోపలికి వెళ్లి సరుకులు అందించే సందర్భంలో ఐఎస్ఐ హనీట్రాప్, బ్లాక్‌మెయిల్‌తో సమాచారం సేకరించింది. 15?16 ఏళ్ల పిల్లలను కూడా ఉపయోగిస్తున్నారు. ఈ ఘటనలు భద్రతా ఏజెన్సీలను హెచ్చరికలో ఉంచాయి. పిల్లల ద్వారా సమాచారం సేకరణ కొత్త ఆందోళన.

# అఘోరి రోజు ఆదాయం 30 వేలు...

హైదరాబాద్, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

శవ్యాప్తంగా సంచలనం రేపిన 'అఘోరీ శ్రీనివాస్' ని అంత తేలికగా మర్చిపోగలమా?..మగవాడు అయినప్పటికీ లేడీ అఘోరీ గా మారి, మాయ మాటలు చెప్పి, అమాయకులను మోసం చేసి కోట్ల రూపాయిల సంపాదన అతి తక్కువ సమయం లోనే సంపాదించాడు. అంతే కాదు, ఇతను ఆడవాళ్లను లొంగదీసుకోవడం లో కూడా నేర్పరి. శ్రీ వర్షిణి అనే అందమైన అమ్మాయిని మాయ మాటలు చెప్పి తన వెంట తిరిగేలా చేసాడు. రెండు నెలల పాటు ఆ అమ్మాయి అతనితో కలిసి ప్రయాణం చేసింది. కుటుంబ సభ్యులు వర్షిణి కోసం వెతకాని ప్రదేశం అంటూ లేదు. అంతలా మాయ చేసి తన వెంట తీసుకొని వెళ్ళిపోయాడు. అయితే ఎట్టకేలకు అఘోరి శ్రీనివాస్ దుర్మార్గాలను గమనించిన పోలీసులు అతన్ని అదుపులో తీసుకున్నారు. అయితే రెండు నెలల పాటు అతనితో కలిసి తిరిగి శ్రీ వర్షిణి అనే అమ్మాయి, రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూ ఇచ్చింది.



ఈ ఇంటర్వ్యూ లో ఆమె మాట్లాడిన మాటలు చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. ఆమె మాట్లాడుతూ 'రెండు నెలల పాటు నేను అతనితోనే ఉన్నాను. దేవాలయాలకు బాగా తిప్పేవాడు, అక్కడ ప్రసాదాలు తీసుకోవడం, పడుకోవాలని అనుకుంటే ఎక్కడైనా పెట్రోల్ బంక్ వద్ద కారు ఆపేసి నిద్రపోవడం వంటివి చేసేవాడు. మంచి ఫేమ్ ఉన్న వ్యక్తి కాబట్టి, భక్తులు ఆయన కారు స్టిక్కరింగ్ ని చూసే వచ్చేవాళ్ళు. ఒక్కొక్కరు 500 , లేదా వెయ్యి రూపాయిలు ఇవ్వడం, కారు కి పెట్రోల్ ఫుల్ ట్యాంక్ చేయించడం, ఫుడ్ తినిపించడం, ఖరీదైన బట్టలు పెట్టడం వంటివి చేసేవారు. అలా రోడ్డు మీద వెళ్తున్న సమయం లో అతనికి ఎవరో ఒకరు ఎంతో కొంత డబ్బులు ఇస్తూనే ఉండేవాళ్ళు. అలా రోజుకి అతను పాతిక నుండి 30 వేల రూపాయిలు సంపాదించేవాడు. పెట్రోల్ ఫ్రీనే, డబ్బు ఫ్రీనే, ఆహారం ఫ్రీనే, ఇంకేమి ఉంది చల్లగా ౦అ పెట్టుకొని పాడుకోవడమే అతను చేసే పని' అంటూ చెప్పుకొచ్చింది.

ఇంత జరుగుతుంటే మీకు అతన్ని ఎప్పుడు ప్రశ్నించాలని అనిపించలేదా అని యాంకర్ అడిగిన ప్రశ్నకు, వర్షిణి సమాధానం చెప్తూ 'ఆశ్రమాన్ని నిర్మించాలని అనేవాడు. నేను అతన్ని అప్పట్లో గుడ్డిగా నమ్మేసాను, ఒక ట్రాన్స్ లోకి వెళ్ళిపోయాను. అతనే లోకం అంటూ తిరిగాను కదా, అందుకే అన్నీ నమ్మేదాన్ని' అంటూ చెప్పుకొచ్చింది. మీ కుటుంబ సభ్యులు నిన్ను అతి కష్టం మీద వెతికి మూడు వారాల తర్వాత ఇంటికి తిరిగి తీసుకొచ్చారు కదా, అప్పుడు మళ్లీ మీరెందుకు పారిపోయారు అని యాంకర్ అడగ్గా 'దాదాపుగా పారిపోయాను అనే అనుకోండి, కానీ మధ్యలో కొంతమంది ఉన్నారు. వాళ్ళ వల్లే నేను వెళ్లాల్సి వచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది.

====================

# రాజాసాబ్ అంచనాలు తలకిందులు

హైదరాబాద్, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

రెబల్ స్టార్ ప్రభాస్ హీరో గా నటించిన 'రాజా సాబ్' చిత్రం నిన్న ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ విడుదలై నెగిటివ్ టాక్ ని సొంతం చేసుకుంది. ఆ నెగిటివ్ టాక్ ప్రభావం నూన్, మ్యాట్నీ షోస్ మీద చాలా బలంగా పడింది కానీ, ఫస్ట్ షోస్ నుండి కాస్త పికప్ అయ్యాయి. ఇక సెకండ్ షోస్ అయితే అన్ని సెంటర్స్ లో దుమ్ము దులిపేసింది. ఫ్లాప్ టాక్ వల్ల ఘోరమైన డిజాస్టర్ ఓపెనింగ్స్ వస్తాయని అంతా అనుకున్నారు కానీ, ప్రభాస్ పరువు నిలబెట్టే ఓపెనింగ్ ని చివరికి సొంతం చేసుకుంది. ముఖ్యంగా నైజాం ప్రాంతం లో ఈ చిత్రం చాలా డీసెంట్ వసూళ్లను నమోదు చేసుకుంది. ప్రీమియర్ షోస్ భారీగా లేకపోవడం ఈ సినిమాకు చాలా ప్లస్ అయ్యింది ఈ ప్రాంతంలో. ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఈ చిత్రానికి గ్రాస్ వసూళ్లు వచ్చాయో ఒకసారి చూద్దాం.ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం చూస్తే ఈ చిత్రానికి నైజాం ప్రాంతం లో మొదటి రోజు 18.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. షేర్ వసూళ్లు దాదాపుగా 12 కోట్ల రూపాయిల వరకు ఉంటుందని అంచనా. అదే విధంగా ఆంధ్రా + సీడెడ్ ప్రాంతం నుండి 34 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. ఓవరాల్ గా తెలుగు రాష్ట్రాల నుండి 52.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు, 34 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. వచ్చిన టాక్ కి ఇది చాలా డీసెంట్ షేర్ వసూళ్లు అనే చెప్పాలి. ఇక ఓవర్సీస్ ప్రాంతం నుండి ఈ చిత్రానికి కేవలం 27 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు మాత్రమే వచ్చాయి. అదే విధంగా కర్ణాటక ప్రాంతం నుండి 6 కోట్లు, రెస్ట్ ఆఫ్ ఇండియా నుండి 8 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి.ఓవరాల్ వరల్డ్ వైడ్ గా ఈ చిత్రానికి 93.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళు నమోదు అయ్యింది. తెలుగు రాష్ట్రాల్లో రామ్ చరణ్ 'గేమ్ చేంజర్', పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకంటే



తక్కువ ఓపెనింగ్ వసూళ్లు వచ్చాయి కానీ , ఓవర్సీస్ ప్రాంతం లో ఆ రెండు సినిమాల కంటే డీసెంట్ వసూళ్లను నమోదు చేసుకోవడం తో ప్రభాస్ పరువుని నిలబెట్టే రేంజ్ ఓపెనింగ్ దక్కింది. ఆయన అభిమానులకు మొదటి రోజు వంద కోట్ల గ్రాస్ మిస్ అయ్యామే అనే బాధ ఉంటుంది కానీ, ఈ టాక్ తో కూడా ఈ రేంజ్ గ్రాస్ ని రాబట్టినందుకు ప్రభాస్ స్టార్ స్టేటస్ ని చూసి గర్వపడొచ్చు అనే చెప్పాలి.

================

# ఆ ఐదుగురు ఎవరు...

హైదరాబాద్, జనవరి 10 భారతశక్తి ప్రతినిధి,

తెలంగాణ క్యాబినెట్లో..ఇప్పుడు ఒకటే చర్చ. అమాత్యులపై ఆరోపణలు..వివాదాలతో..ఎవరి సీటుకు ఎసరు వస్తుందనేది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటిదాకా ఖాళీగా ఉన్న రెండు బెర్తులపైనే ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలకు..ఇప్పుడు ఖాళీ కాబోయే బెర్తులూ కూడా ఊరిస్తున్నాయట. దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్ మంత్రి ఓ మహిళా అధికారితో నడిపిన..నడుపుతున్న వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. ఎక్కడ చూసినా ఆ మంత్రెవరు..? ఆ అధికారెవరన్న చర్చే. ఆయన తెరచాటు వ్యవహారాలు..సర్కార్కు బ్యాడ్ నేమ్ తెచ్చిపెడుతున్నాయట. సదరు మంత్రి కారణంగా ఇద్దరు మహిళా అధికారుల బదిలీలు కూడా జరిగాయటపార్టీలో అందరికన్నా తానే సీనియర్ అని చెప్పుకునే ఆ సదరు అమాత్యుల వారికి సంబంధించిన పూర్తి డేటా..ఇంటలిజెన్స్ రిపోర్టు ఢిల్లీకి కూడా చేరిపోయిందట. దీంతో గత అసెంబ్లీ సమావేశాల్లో ఒంటికాలిపై లేచిన ఆ అమాత్యుడు..ఈ సెషన్లో పూర్తిగా సైలెంట్ అయిపోయారట. ఈ నేపథ్యంలోనే ఆయన కుర్చీకి ఎసరు తప్పదనే ప్రచారం జరుగుతోంది.ఇక దక్షిణ తెలంగాణకే చెందిన మరో సీనియర్ మంత్రిది ఇదే పరిస్థితి అంటున్నారు. ఎన్నికల ముందే హస్తం గూటికి చేరి..ఇప్పుడు అమాత్యులుగా ఉన్న ఆ మంత్రిగారికి కూడా ఉద్వాసన తప్పదంటున్నారు. ఆర్టీఐ ద్వారా తన శాఖలోని అధికారుల దందాలను ఆ మంత్రే బయట పెట్టడమే కారణమనే టాక్ నడుస్తోంది. వీరిద్దరూ తెలంగాణ ఉద్యమానికి తామే బ్రాండ్ అంబాసిడర్లం అని కూడా చెప్పుకునే నేతలే కావడం మరో విశేషం.ఇక మరో ఉత్తర తెలంగాణ మంత్రిది ఇంకో కథ. హైదరాబాద్లో అంతా తానై చక్రం తిప్పుతున్న సదరు మంత్రి చేష్టలు..సర్కార్కు హెడెక్గా మారాయట. మహిళా అధికారులు, నేతలతో జోక్లు..వింత పలుకులతో ఆయన తీరు చర్చనీయాంశంగా మారిందంటున్నారు. సదరు మంత్రి తీరుపై ఇప్పటికే కొందరు అధికారులు..సీఎంవో దృష్టికి తీసుకెళ్లారట. ఇది చాలదన్నట్లు..ఇటీవల ఒకరిద్దరు మహిళా జర్నలిస్టులతో కూడా ఆయన సన్నిహితంగా ఉంటూ..వాట్సప్ కాల్స్..ఇన్స్టాలో మెస్సేజ్లు పెడుతూ టీనేజర్గా మారిపోయారన్న గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారంతో సదరు అమాత్యులవారికి ఉద్వాసన తప్పదన్న గుసగుసలు సెక్రటేరియట్లో రచ్చ రంబోలా చేస్తున్నాయి.

ఇంకో సీనియర్ మంత్రిపై కూడా?చిలిపి చేష్టలు, కరప్షన్ అలిగేషన్స్తో గందరగోళం నెలకొందట. సమైఖ్య రాష్ట్రంలోనే..సీనియర్ మోస్ట్ నేతగా ఉన్న ఆయనకు ఓ టైప్ ఆఫ్ డ్యాషింగ్ లీడర్గా పేరుంది. ఈ సదరు మంత్రితో సూటిగా మాట్లాడాలంటే..అధికారులే కాదు..తోటి లీడర్స్ కూడా జంకుతుంటారు. తన అనుకున్న వారిపై ట్రాన్స్ఫర్స్ గాలి సోకకుండా.. ప్రొటెక్టర్గా ఉంటుంటడం వెనుక ఏవో మతలబులున్నాయనే టాక్ నడుస్తోంది. అవినీతి ఆరోపణలు పెరిగిపోవడంతో ఆయనపై కూడా రిపోర్టులు రెడీ అయ్యాయని తెలుస్తోంది.ఉత్తర తెంగాణకు చెందిన మరో సీనియర్ మహిళా మంత్రి పదవి కూడా..క్యాబినెట్ విస్తరణలో గల్లంతు అవడం పక్కా అంటున్నారు. సర్కార్ ఏర్పడిన కొత్తలో ఈ సీనియర్ మంత్రి నోటి మాటతో రేవంత్ సర్కార్కు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడగా..తన ఇంటి మనిషి అవినీతి వ్యవహారాన్ని వెనుకేసుకుని రావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అది ఇప్పటికీ విపక్షాలకు అస్త్రంగా ఉంటూనే వస్తోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఆ మహిళా మంత్రిని క్యాబినెట్ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు మహిళా మంత్రికి విస్తరణ మాట వింటే చాలు కంటి మీద కునుకు రావడం లేదట.ఐదుగురు మంత్రులకు ఉద్వాసన పలికితే..అప్పుడు కేబినెట్ లో ఖాళీ బెర్తుల సంఖ్య ఆరుకు చేరనుంది. అటు అజారుద్దీన్ స్థానం కూడా ఊగిసలాటలోనే ఉండటంతో కేబినెట్ లో బెర్తుల కోసం దాదాపు డజన్ మంది కాపు కాసుకుని కూర్చున్నారట. ఇప్పటికే ఈ లిస్ట్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు తొలిసారి ఎన్నికై అసెంబ్లీ లోపలా, బయట.. ఫైర్ బ్రాండ్ లీడర్లుగా ఎస్టాబ్లిష్ అవుతున్న మరికొందరు యువ ఎమ్మెల్యేలకు కూడా అదృష్టం కలిసి రావచ్చని టాక్ నడుస్తోంది.

# తిట్ల దండకంలో తండ్రినే మించిపోతున్న కేటీఆర్?

హైదరాబాద్, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు ప్రజా సమస్యల చర్చ కంటే.. వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలమే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ఉద్యమ సెగతో రగిలిన తెలంగాణ గడ్డపై ఇప్పుడు రాజకీయ కక్షలు ? బూతుల పర్వాలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరి ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. తన తండ్రి కేసీఆర్ వేసిన తిట్ల బాటలో నడుస్తూ.. ఇప్పుడు ఆయననే మించిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వాడిన భాష ఒక ఆయుధంగా పనిచేసింది. సమైక్య పాలకులను ఉద్దేశించి ఆయన వాడిన పిచ్చోళ్లు, దెబ్బకు దెయ్యం వదులుతది వంటి పదాలు అప్పట్లో ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అయితే, అధికారం వచ్చాక కూడా అదే ధోరణి కొనసాగడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. చివరకు 2024 ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం కూడా కేసీఆర్ వాడిన అన్ పార్లమెంటరీ భాషపై సీరియస్ అయ్యి నోటీసులు ఇచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు చెక్ పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అదే భాషా యుద్ధాన్ని కొనసాగిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా గానీ, బహిరంగ సభల్లో గానీ బీఆర్ఎస్ నేతలపై విరుచుకుపడుతున్నారు. 2025 డిసెంబర్ నాటి అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ రెడ్డి వాడిన కొన్ని పదాలు సభ్య సమాజాన్ని విస్మయానికి గురిచేశాయి. అలాగే సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేసేవారిని బట్టలు ఊడదీసి పరేడ్ చేస్తాం అనడం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రికి తగదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.విదేశాల్లో చదువుకుని, కార్పొరేట్ శైలిలో రాజకీయాలు చేస్తారని పేరున్న కేటీఆర్.. ఓటమి తర్వాత పూర్తిస్థాయిలో రూటు మార్చారు.



రేవంత్ రెడ్డి విమర్శలకు కౌంటర్ ఇచ్చే క్రమంలో ఆయన కూడా సంయమనం కోల్పోతున్నారు. తాజాగా ఖమ్మంలో కేటీఆర్ వాడిన పదజాలం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలను కేటీఆర్ అసభ్యపదజాలంతో దూషించారు. రేవంత్ రెడ్డిని గూండాగిరి చేస్తున్నారని విమర్శిస్తూనే, కేటీఆర్ కూడా అదే స్థాయి పదజాలంతో విరుచుకుపడుతున్నారు. ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ వ్యక్తిగత దూషణలకు దిగడం కేటీఆర్ ఇమేజ్కు డ్యామేజ్ కలిగిస్తోందనే వాదన వినిపిస్తోంది.రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ, అవి లక్ష్మణ రేఖను దాటకూడదు. "రేవంత్ తిడుతున్నారు కాబట్టి మేము కూడా తిడతాం" అని బీఆర్ఎస్ సమర్థించుకోవడం ఆ పార్టీ నైతికతను దెబ్బతీస్తుంది. కేటీఆర్ లాంటి విద్యావంతుడైన నాయకుడు ఈ తిట్ల సంస్కృతికి చరమగీతం పాడి, ఒక కొత్త తరహా రాజకీయాలకు నాంది పలకాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, అధికార-ప్రతిపక్షాల మధ్య జరుగుతున్న ఈ బూతుల యుద్ధంలో అసలైన ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుంది. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. వారు నేతల నోటి వెంట తిట్లు కాదు.. తమ సమస్యలకు పరిష్కారాలు కోరుకుంటున్నారు. ఈ నిజాన్ని నాయకులు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

# మంత్రుల ప్రేమ వ్యవహారం...

హైదరాబాద్, జనవరి 10, (భారతశక్తి ప్రతినిధి,

10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అలాగని జనాలు వన్ సైడ్ విక్టరీని కాంగ్రెస్ పార్టీకి అందించలేదు. గులాబీ పార్టీ బలమైన ప్రతిపక్షంగా ఇప్పటికీ ఉంది. పార్లమెంటు ఎన్నికల్లో 0 సీట్లు వచ్చినప్పటికీ.. సర్పంచ్ ఎన్నికలలో సత్తా చూపించలేకపోయినప్పటికీ? సోషల్ మీడియాలో మాత్రం కాంగ్రెస్ పార్టీ గులాబీ పార్టీ కంటే అత్యంత బలంగా ఉంది. వాస్తవానికి ఈ విషయంలో రేవంత్ రెడ్డి ఒక విఫల ముఖ్యమంత్రి. ఇక మిగతా మంత్రుల సంగతి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.నేటి కాలంలో సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ఆరోపణకు అధికార పార్టీ నుంచి కౌంటర్ ఉండాల్సిందే. అవసరమైతే ఆ కౌంటర్ చాలా సాలిడ్ గా ఉండాలి. దీనికోసం అనేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వం నుంచి అమలవుతున్న పథకాలను పకడ్బందీగా ప్రచారం చేసుకోవాలి. అదే సమయంలో గులాబీ పార్టీ చేసే విష ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి. కానీ ఇది అధికార కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చేతకావడం లేదు. పైగా ఆ పార్టీ సోషల్ మీడియా వింగ్ అత్యంత దారుణమైన ప్రదర్శన చేస్తోంది. కౌంటర్ ఇవ్వడం కాదు కదా కనీసం.. తనను తాను కాపాడుకోవడం కూడా ఆ పార్టీకి, ఆ ఆ పార్టీ సోషల్ మీడియాకు ఏమాత్రం చేతకావడం లేదు.తాజాగా గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియా తెలంగాణ మంత్రుల మీద విష ప్రచారం మొదలుపెట్టింది. ఏకంగా ఆ మంత్రులు తమ స్థాయిని మర్చిపోయి, తమ వయసును మర్చిపోయి ప్రేమ వ్యవహారాలు సాగిస్తున్నారని బాంబు పేల్చింది.


ఇటీవల సెక్రటేరియట్లో ఓ అధికారి షాడో గా వ్యవహరిస్తున్నారని.. పై స్థాయిలో అండదండలు ఉండడంతో క్యాబినెట్ స్థాయిలో ప్రోటోకాల్ ఇస్తున్నామని చెబుతున్నారని రాజ్ టీవీ ఒక సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. దానిని మర్చిపోకముందే ఎన్టీవీ నల్గొండకు సంబంధించిన ఓ మంత్రికి వ్యవహారాన్ని కథనం రూపంలో ప్రసారం చేసింది. నల్గొండ జిల్లా చెందిన ఓ మంత్రి.. ఓ కలెక్టర్ విషయంలో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించారని.. ఆమెతో ప్రేమ వ్యవహారం కూడా సాగించారని.. ఎన్టీవీ ఆ కథనంలో ప్రసారం చేసింది. అయితే ఆ ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి ఆ కలెక్టర్ ను ప్రభుత్వం బదిలీ చేయించిందని ఎన్ టీవీ ప్రసారం చేసిన కథనంలో పేర్కొంది.రాజ్ టీవీ, ఎన్ టివి ప్రసారం చేసిన కథనాలను గులాబీ పార్టీ సోషల్ మీడియా తనకు అనుకూలంగా మార్చుకుంది. ఈ కథనాలకు కాస్త మసాలా జోడించి ఆ పార్టీ సోషల్ మీడియా అడ్డగోలుగా ప్రచారం చేయడం మొదలుపెట్టింది.

తెలంగాణ రాష్ట్రంలో మంత్రులు ప్రేమ వ్యవహారాలలో మునిగి తేలుతున్నారని.. ఏకంగా సెక్రటేరియట్లో ఓ అధికారి తనకు పై స్థాయి అండ ఉందని ప్రచారం చేసుకుంటున్నారని.. అందువల్లే అధికారులు ఆమెకు క్యాబినెట్ స్థాయి ప్రోటోకాల్ ఇస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.మరోవైపు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ మంత్రి మహిళా అధికారులను వేధిస్తున్నారని.. కనీసం సీనియర్ మహిళా విలేకరులను కూడా వదిలిపెట్టడం లేదని.. ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవాలు ఎలా ఉన్నప్పటికీ గులాబీ పార్టీ సోషల్ మీడియా మాత్రం విపరీతంగా ప్రచారం మొదలుపెట్టింది. మరి దీనికి కాంగ్రెస్ పార్టీ ఎలాంటి కౌంటర్ ఇస్తుంది? అనే ప్రశ్నకు ఇప్పుడు సమాధానం లభించాల్సి ఉంది.

# అంబర్పేట్ ఎస్ ఐ భాను ప్రకాష్ రెడ్డి అరెస్ట్

హైదరాబాద్ జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

అంబర్ పేట పోలీసు స్టేషన్ లో ఎస్సై గా పని చేస్తున్న



భాను ప్రకాష్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. భాను ప్రకాష్ రెడ్డి బెట్టింగ్ అప్పులు తీర్చేందుకు రికవరీ సొత్తు కాజేసి తాకట్టు పెట్టిన విషయం తెలిసిందే. తన సర్వీస్ రివాల్వర్ ను ఎక్కడో పోగొట్టుకున్నాడు. ట్రైన్ లో ప్రయాణిస్తున్న సందర్భంలో రివాల్వర్ పోయిందని స్టేట్మెంట్ ఇచ్చాడు. ఎంత వెతికినా గన్ కనిపించలేదని చెప్పాడు. భాను ప్రకాష్ రెడ్డి ఏపీ లో గ్రూప్2 ఉద్యోగం పొందాడు. ఇక్కడ రిలీవ్ చేయాలని రిక్వెస్ట్ పెట్టుకున్నాడు.

# కాంగ్రెస్ గూటికేనా...

హైదరాబాద్, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసనమండలి వేదికగా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాజీనామాను ఆమోదించాల్సిందేనని ఆమె నిండు సభలో పట్టుబట్టడం, మండలి ఛైర్మన్ దాన్ని పునరాలోచించుకోవాలని సూచించడం వంటి పరిణామాలు ఒక పొలిటికల్ థ్రిల్లర్ ను తలపిస్తున్నాయి. అయితే, ఈ రాజీనామా వెనుక కేవలం అసంతృప్తి మాత్రమే ఉందా? లేక దీని వెనుక ఒక భారీ రాజకీయ వ్యూహం దాగి ఉందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిందిశాసనమండలిలో కవిత ప్రవర్తించిన తీరు బీఆర్ఎస్ శ్రేణులను సైతం విస్మయానికి గురిచేసింది. తన రాజీనామా లేఖను ఆమోదించాలని ఆమె ఛైర్మన్ ను కోరగా, తొందరపడవద్దని, నిర్ణయంపై పునరాలోచించుకోవాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. అయినప్పటికీ, కవిత తన నిర్ణయానికి కట్టుబడి ఉంటారా లేక ఛైర్మన్ సూచన మేరకు వెనక్కి తగ్గుతారా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్ గానే ఉంది. కానీ, సభలో ఆమె బీఆర్ఎస్ పార్టీ విధానాలపై, నాయకత్వంపై పరోక్షంగా నిప్పులు చెరిగిన తీరు చూస్తుంటే.. గులాబీ పార్టీతో ఆమె బంధం తెగిపోయినట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్ లో కవిత చేసిన ఒక వ్యాఖ్య అత్యంత కీలకమైనది. "వచ్చే ఎన్నికల నాటికి 'జాగృతి' ఒక శక్తిగా రూపాంతరం చెందుతుంది, అందరూ ఆశీర్వదించాలి" అని ఆమె కోరడం వెనుక పెద్ద ప్లాన్ ఉందని అర్థమవుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో సాంస్కృతిక సారథిగా ఉన్న తెలంగాణ జాగృతిని ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే యోచనలో కవిత ఉన్నట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ లో ఇన్నాళ్లుగా ఉన్న అసమ్మతిని, తనకంటూ ఉన్న వ్యక్తిగత క్యాడర్ ను జాగృతి వేదికగా ఏకం చేయడం ఆమె తక్షణ కర్తవ్యంగా కనిపిస్తోంది. కవిత కొత్త పార్టీ పెడతారన్న వార్తల నడుమ.. అత్యంత ఆసక్తికరమైన ప్రచారం విలీనం చుట్టూ తిరుగుతోంది. వైఎస్ జగన్ సోదరి షర్మిల మొదట 'వైఎస్ఆర్టీపీ' పేరుతో పార్టీ పెట్టి, ఆ తర్వాత దాన్ని కాంగ్రెస్ లో విలీనం చేసి, ఇప్పుడు పీసీసీ చీఫ్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు కవిత కూడా అదే బాటలో నడవబోతున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కవిత నేరుగా కాంగ్రెస్ లో చేరడం కంటే, జాగృతిని పార్టీగా మార్చి, ప్రజల్లోకి వెళ్లాక, ఎన్నికల సమయానికి కాంగ్రెస్ లో విలీనం చేయడం వ్యూహాత్మకంగా మంచిదనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల అటు సొంత బలం నిరూపించుకోవడంతో పాటు, ఇటు కాంగ్రెస్ హైకమాండ్ వద్ద బార్గెనింగ్ పవర్ పెరుగుతుందన్నది అంచనా. ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. కవిత కాంగ్రెస్ లోకి రావచ్చంటూ ఆయన చేసిన ప్రకటన.. తెరవెనుక జరుగుతున్న మంత్రాంగం బయటపడేలా చేసింది. బీఆర్ఎస్ ను, ముఖ్యంగా కేసీఆర్ కుటుంబాన్ని దెబ్బకొట్టడానికి కాంగ్రెస్ పార్టీ కవితను ఒక 'బ్రహ్మాస్త్రం'లా వాడుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. కేసీఆర్ కుమార్తెనే కాంగ్రెస్ గూటికి చేరితే.. అది బీఆర్ఎస్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే కాక, ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీస్తుంది. మొత్తానికి కవిత రాజీనామా ఎపిసోడ్ కేవలం ఒక పదవికి సంబంధించిన విషయం కాదు. ఇది తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే ఒక భారీ ఆపరేషన్ కు నాందిగా కనిపిస్తోంది. రానున్న రోజుల్లో జాగృతి యాక్టివిటీ పెరగడం, బీఆర్ఎస్ పై కవిత విమర్శల దాడి తీవ్రతరం కావడం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ రాజకీయ చదరంగంలో కవిత వేసే ఎత్తులు, దానికి కాంగ్రెస్ అందించే సహకారం.. బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదంగా మారే అవకాశాలను కొట్టిపారేయలేం

# ఖమ్మం, తాడేపల్లిలో పోస్టర్ల కలకలం

ఖమ్మం, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

లేటెస్ట్‌గా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చేసిన వ్యాఖ్యలు మరింత ఇంట్రెస్టింగ్‌గా మారాయి. వైసీపీ క్యాడర్..తెలంగాణలో కేసీఆర్ గెలవాలని కోరుకుంటారని.. బీఆర్ఎస్ క్యాడర్ ఏపీలో జగన్ అధికారంలోకి రావాలని కోరుకుంటారని చెప్పారు. దీనికి ఆయన ఒక ఈక్వేషన్ కూడా చెప్పి చర్చకు దారి తీశారు. అదే దుష్మన్ కా దుష్మన్ అప్నా దోస్త్ అనే పాయింట్ తప్ప..వేరే కారణాలు ఏమి ఉండవంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజానికి తెలంగాణలో రేవంత్ సీఎం అయినప్పుడు కాంగ్రెస్ ర్యాలీల్లో ..రేవంత్ ఇంటి దగ్గర టీడీపీ జెండాలు కనిపించాయి. మరోవైపు జగన్ పర్యటనల్లో కేసీఆర్, కేటీఆర్ ఫోటోలు కనిపించడం కూడా పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. లేటెస్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం పర్యటనలో..వైసీపీ జెండాలు కనిపించాయి. కేటీఆర్ ర్యాలీలో వైసీపీ ఫ్లాగ్స్‌తో, జగన్ నినాదాలతో సందడి చేశారు ఫ్యాన్ పార్టీ అభిమానులు. ఖమ్మం జిల్లాలో వైసీపీకి పట్టుంది. టీడీపీకి కూడా క్యాస్ట్ ఈక్వేషన్స్ పరంగా మంచి బలమే ఉంది. ఇప్పుడు ఖమ్మం జిల్లాలో ఇటు కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న నేతలు..అటు బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న నేతలు వైసీపీ, టీడీపీ నుంచి వచ్చిన వారే. 2014లో ఖమ్మంలో మూడు ఎమ్మెల్యేలు సహా, ఒక ఎంపీ సీటును గెలుచుకుంది వైసీపీ. టీడీపీ కూడా ఖమ్మంలో ఒక సీటును, 2018లో రెండు సీట్లను గెలుచుకుంది. సీట్ల పరంగానే కాదు..వైసీపీ, టీడీపీ అభిమానులు కూడా ఖమ్మం జిల్లాలో డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్నారు. అయితే రేవంత్ ఆల్రెడీ చంద్రబాబుతో కలిసి పని చేసిన నేతగా..వాళ్లిద్దరూ ఒక్కటే అన్న భావనతో..గత ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ క్యాడర్ ఔట్‌రైట్‌గా కాంగ్రెస్‌కు సపోర్ట్ చేసిందన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు రాబోతున్న వేళ కేటీఆర్ ఖమ్మం పర్యటనలో వైసీపీ ఫ్లాగ్స్ కనిపించడం చర్చకు దారితీస్తోంది. ఖమ్మంలో వైసీపీ క్యాడర్, జగన్ అభిమానులు బీఆర్ఎస్ వెంట మద్దతుగా నిలిస్తే..పోటీ మరోలా ఉంటుందన్న అంచనాలున్నాయి. అటు ఏపీ మాజీ సీఎం జగన్ కార్యక్రమాల ఫ్లెక్సీల్లో కేసీఆర్, కేటీఆర్ ఫోటోలు.

బీఆర్ఎస్ కార్యక్రమాల్లో వైఎస్ జగన్ ఫ్లెక్సీలు, వైసీపీ జెండాలు కనిపించడంతో తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అసలేం జరుగుతోందన్నది హాట్ టాపిక్‌గా మారింది. గతేడాది నవంబర్‌లో వైఎస్ జగన్ హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు వచ్చిన సందర్భంగా అభిమానులు ఆయనకు భారీ ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీబీఐ కోర్టు దగ్గర ఓ అభిమాని ప్రదర్శించిన ఫ్లెక్సీలో జగన్‌తో పాటు కేటీఆర్ ఫోటోను ఉంచారు. జగన్ కోర్టు నుంచి లోటస్ పాండ్ కు వెళ్లే క్రమంలో వైసీపీ జెండాలతో పాటు అక్కడక్కడ బీఆర్ఎస్ జెండాలు కూడా కనిపించాయి. జగన్ పుట్టిన రోజు కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యింది. జగన్ బర్త్ డే సందర్భంగా తాడేపల్లిలో కేసీఆర్, కేటీఆర్, జగన్‌తో కూడిన ఫ్లెక్సీ వెలిసింది. అది కూడా రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపింది. ఇక ఇటు తెలంగాణ సీఎం రేవంత్..అటు ఏపీ సీఎం చంద్రబాబు దోస్తీ అనే ప్రచారం ఓవైపు..జగన్, కేసీఆర్ మిత్రులంటూ కాంగ్రెస్ విమర్శలు రెగ్యులర్ అయిపోయాయి. ఇలా తెలంగాణ సెంట్రిక్‌గా టీడీపీ వర్సెస్ వైసీపీ..బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ రాజకీయం?నెక్ట్ లెవల్ హీట్‌ను క్రియేట్ చేస్తోంది.

# కమలం వైపు.. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు

నల్గొండ, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

రాబోయే ఎన్నికల వరకు మరింత బలపడి అధికారంలోకి రావాలని కలలు కంటున్న కమలనాథులు..దక్షిణ తెలంగాణలో పేరున్న నేతలను పార్టీలో చేర్చుకోవాలని భావిస్తున్నారట. ఇందులో భాగంగా నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఫోకస్ పెట్టిందట బీజేపీ. ఆ ఇద్దరు కూడా గతంలో బీజేపీలో పనిచేసిన ఎమ్మెల్యేలే అంటూ గాసిప్స్ చక్కర్లు కొడుతున్నాయ్. ఉత్తర తెలంగాణలో బీజేపీ స్ట్రాంగ్‌గా ఉంది. నార్త్ తెలంగాణలో మూడు ఎంపీ సీట్లు, ఏడు ఎమ్మెల్యే సీట్లు గెలుచుకున్న కమలనాథులు..గ్రాడ్యుయేషన్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్నారు. మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లోనూ ఉత్తర తెలంగాణలో గతం కంటే ఎక్కువ స్థానాలే గెలుచుకున్నారు. దక్షిణ తెలంగాణలో ఒకరిద్దరు మినహా.. బీజేపీకి పెద్దగా పట్టున్న లీడర్లు లేరన్న అభిప్రాయం ఉంది. పైగా క్యాడర్ కూడా స్ట్రాంగ్ లేదని భావిస్తున్నారట. ఈ క్రమంలో దక్షిణ తెలంగాణలో కాస్త పేరున్న, ప్రజాబలం ఉన్న లీడర్లను..చేర్చుకుంటే..రాబోయే ఎన్నికల్లో సత్తా చాటొచ్చని ప్లాన్ చేస్తున్నారట. తెలంగాణలో అధికారంలోకి రావాలంటే..దక్షిణ తెలంగాణ జిల్లాలైన నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో కూడా బలపడాలని లెక్కలు వేసుకుంటున్నారట కాషాయ నేతలు. ఈ క్రమంలో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఫోకస్ పెట్టారట బీజేపీ లీడర్లు. దక్షిణ తెలంగాణకు చెందిన ఇద్దరు శాసనసభ్యులు..బీజేపీ స్టేట్ లీడర్లతో టచ్‌లో ఉంటున్నారట. నల్లగొండకు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే, పాలమూరుకు చెందిన మరో హస్తం పార్టీ ఎమ్మెల్యే..కొన్ని రోజులుగా వాళ్ల సొంత పార్టీ పెద్దలపై అసంతృప్తిగా ఉన్నారట. అడిగిన పనులు చేసి పెట్టడం లేదని..కోరుకున్న పదవులు ఇవ్వట్లేదని నిరుత్సాహంగా ఉన్నారట. ఈ క్రమంలోనే వాళ్లు అప్పుడప్పుడు సొంత పార్టీపై, సీఎం రేవంత్‌పై అసంతృప్తి గళం వినిపిస్తున్నారట. అలా కాంగ్రెస్ పార్టీలో కంఫర్ట్‌గా లేని ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపైన కన్నేసిన కమలనాథులు తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారట. హైదరాబాద్ జంట నగరాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ బీజేపీ ఎంపీ.. దక్షిణ తెలంగాణకు చెందిన మరో బీజేపీ మహిళా నాయకురాలు.. ఆ ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు టచ్‌లోకి వెళ్లినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

హస్తం పార్టీలో అసంతృప్తిగా ఉన్న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలతో.. తమకు ఉన్న సాన్నిహిత్యం, పరిచయాలతో కమలం గూటికి చేర్చే ప్రయత్నం చేస్తున్నారట. అయితే బీజేపీలోకి ఎవరైనా వస్తే పార్టీ సంప్రదాయం ప్రకారం వారు పార్టీతో పాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రావాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు కొందరు బీజేపీ లీడర్లు. దీంతో సరైన సమయంలో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు సరైన నిర్ణయం తీసుకుంటారన్న టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నది నిజమే అయితే..వాళ్లు కమలం గూటికి రావాలనుకుంటే మాత్రం..రాష్ట్రంలో పొలిటికల్ సినారియో మారిపోవడం ఖాయమన్న చర్చ జరుగుతోంది.

# ఏపీలో ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ

తిరుపతి, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సందడి ఈసారి సరికొత్త శోభను సంతరించుకుంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పండుగ అంటే కేవలం కాసినోలు, కోడి పందాలు, జూద వినోదాలే అన్నట్లుగా సాగిన పరిస్థితి నుంచి, నేడు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రం కళకళలాడుతోంది. పాలకుల ఆలోచనా ధోరణి మారితే ప్రజల ఉత్సాహం ఎలా ఉంటుందో ప్రస్తుత ఏపీ వేడుకలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో ప్రభుత్వం ఆవకాయ్-అమరావతి సినిమా, సంస్కృతి, సాహిత్యోత్సవం నిర్వహిస్తోంది. తెలుగువారి ఐకానిక్ రుచి ఆవకాయ పేరుతో జరుగుతున్న ఈ వేడుకల్లో సాహిత్యం, కళలు, సినిమా విశ్లేషణలు , సాంస్కృతిక కార్యక్రమాలతో కృష్ణమ్మ తీరం ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యానికి వేదికైంది. జూదానికే పరిమితం కాకుండా, తెలుగు మేధో సంపత్తిని ప్రపంచానికి చాటాలనే లక్ష్యం ఇక్కడ కనిపిస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురాన్ని పీఠికాపురం పేరిట ఆధ్యాత్మిక, సంప్రదాయ వేడుకలకు కేంద్రంగా మార్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సంక్రాంతి మహోత్సవంలో గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలు, జానపద కళారూపాలతో పాతకాలపు పల్లెటూరి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. పీఠికాపురం పురావైభవాన్ని గుర్తు చేస్తూ సాగుతున్న ఈ వేడుకలు స్థానికుల్లో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపాయి. గతంలో పండుగ రోజుల్లో అశ్లీల నృత్యాలు, అక్రమ జూద కేంద్రాలతో భయానక వాతావరణం ఉండేదన్న విమర్శలు ఉండేవి. కానీ ఇప్పుడు ప్రభుత్వం అధికారికంగా సాంస్కృతిక ఉత్సవాలను ప్రోత్సహిస్తుండటంతో సామాన్య ప్రజలు కుటుంబాలతో కలిసి పండుగను ఆస్వాదిస్తున్నారు. హరిదాసుల దీవెనలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ వంటకాలతో ప్రతి ఇల్లు ఒక కళానిలయంగా మారింది. ఇది కేవలం పండుగ మార్పు మాత్రమే కాదు, రాష్ట్రంలో వచ్చిన పాలనాపరమైన మార్పుకు ప్రతిబింబం. ఏపీలో ఇప్పుడు కనిపిస్తున్న సంక్రాంతి కళ కేవలం వినోదం కోసం మాత్రమే కాదు, అది తెలుగు జాతి మూలాలను గౌరవించే ఒక గొప్ప ప్రయత్నం. పాలకుల ప్రాధాన్యతలు మారినప్పుడు, సమాజంలో నైతిక విలువల కంటే సంస్కృతికి పెద్దపీట వేసినప్పుడు ప్రజల్లో ఇలాంటి నిజమైన పండుగ కళ కనిపిస్తోంది.

# స్మశాన సుందరీకరణ పనులు కలగానే మిగిలేనా?

## చస్తే పూడ్చడానికి, కాల్చడానికి స్థలం లేదు నడవాలంటే రోడ్డు లేదు

### నిజాం చెరువు ట్యాంక్ బండ్ కలగానే మిగిలేనా ?

మహబూబాబాద్, జనవరి 10, భారతశక్తి ప్రతినిధి,

జీవించి ఉన్నప్పుడు ప్రజలు చెల్లించే పన్నులు ప్రభుత్వానికి కావాలి కానీ




మరణించిన ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం ఉండే విధంగా పూడ్చడానికి కాల్చడానికి కిలోమీటర్ల దూరం చూసినా స్థలం కూడా ఉండని దుస్థితి మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. మహబూబాబాద్ పట్టణంలో బస్టాండ్ సమీపంలో ఉన్న నిజాం చెరువు (నీలం చెరువు) శిఖం భూములలో తరతరాల నుండి వస్తున్న స్మశాన వాటిక మరియు ప్రజల అవసరాల నిమిత్తం కేటాయించిన నిజాం చెరువు ప్రక్కన నుండి బస్టాండ్ రైల్వే గేట్ కలిపే నెక్లెస్ రోడ్డు హైకోర్టు వెడల్పు తగ్గిస్తూ రిజిస్ట్రేషన్ భూములు కలిగిన వారికి ఇచ్చిన తీర్పు తో నెక్లెస్ రోడ్డు నిర్మాణం జరిగి సంవత్సరములు గడుస్తున్నా ప్రజలు వినియోగించుకోకుండా కొందరు భూ కబ్జాదారులు రెవిన్యూ రిజిస్ట్రేషన్ సంబంధిత అధికారులను తైలాలతో మచ్చిక చేసుకుని సుమారుగా 100 సంవత్సరం ల నుండి ఆస్తులు కనిపించే విధముగా నకిలీ పత్రాలు సృష్టించి నిజాం చెరువు రెండు భాగాలను వేరు చేసే విధముగా ప్రయాణించే నక్లెస్ రోడ్డు రాకపోకలను నిలిపివేసి తరతరాల నుండి స్మశాన వాటిక వినియోగంలో ఉన్న నిజాం చెరువు లోతట్టు ప్రాంతాన్ని కొందరు కబ్జాదారులు ప్లాట్స్ గా మార్చి అమ్మకం అమ్మడం జరుగుతుంది. మహబూబాబాద్ జిల్లా మొత్తం ఇదే పరిస్థితి, పట్టణంలో ప్రజలందరికీ అందుబాటు దూరంలో ఉన్న నిజాం చెరువు స్మశాన వాటిక, స్థానిక ప్రజలు అన్ని కుల మతస్తులు వినియోగించుకునే స్మశాన వాటికను పునరుద్ధరించి స్మశాన వాటిక సుందరీ కరణ పనులలో భాగంగా వేచి ఉండేందుకు షెడ్లు, దినకర్మలకు గదులు, నిద్రించే స్థలాలు, నీటి సరఫరా గదులు, విద్యుత్, భద్రత సిబ్బంది, ఎలక్ట్రానికల్ దహన కేంద్రం అమర్చి ప్రజలందరికీ స్మశాన వాటిక వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలందరూ అధికారులందరికీ విజ్ఞప్తిని తెలియపరుస్తూ, గతంలో నుండి ప్రభుత్వాలు స్మశాన వాటికల సుందరి కరుణ పనులకు కేటాయించి విడుదల చేసిన నిధులు స్థానిక అధికారులు కాసులకు కక్కుతులు పడుతూ వాటిని దుర్వినియోగపరిచారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తూ జిల్లా అధికార యంత్రాంగం ఆ యొక్క నిధుల జాబితా పున పరిశీలన చేసి స్మశాన వాటికల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని కోరుతూ,

# విద్యార్థి, యువజన నాయకులపై అక్రమ కేసులు రౌడీషీట్లు ఎత్తివేయాలి

## కూటమి టీడీపీ ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

హైదరాబాద్, జనవరి 10, "రెడ్ బుక్" పాలనలో ప్రజాస్వామ్య హక్కులను హరించడం సిగ్గుచేటు అని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే విద్యార్థి, యువజన నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, రౌడీషీట్లు తెరవడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వారు పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఏఐఎస్ఎఫ్?ఏఐవైఎఫ్ నాయకులపై పెట్టిన రౌడీషీట్లు, కడపలో పలువురు ప్రజా సంఘ నాయకులపై అమలు చేసిన పీడీ యాక్ట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉరితాళ్లు మెడలో వేసుకుని, చేతులకు సంకెళ్లతో, నల్లజెండాలు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘ నాయకులు రెడ్డి పోగు ప్రశాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర తదితరులు మాట్లాడుతూ 2024 ఎన్నికల వాగ్దానాల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాలు అడిగితే అక్రమ కేసులు పెట్టడం, ఉద్యమాలను అణిచివేయడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని అన్నారు. ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చేసిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని, తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న విద్యార్థి?యువజన సంఘ నాయకులను అణిచివేయడానికి ప్రయత్నించడం తగదని వారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యమాల పేరుతో పెట్టిన అన్ని అక్రమ కేసులు, రౌడీషీట్లు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అధికారం తమ చేతిలో ఉందని పోలీస్ వ్యవస్థను ఉపయోగించి ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని ప్రయత్నిస్తే, గ్రామ స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తం వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# గండికోట ఉత్సవాలకు.. సాదర ఆహ్వానం

## -పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వైఎస్ఆర్ కడప, జనవరి 10 (భారత శక్తి): మన గత చరితక వైభవాన్ని, సంస్కృతి సంప్రదాయాలకు దర్పణం పట్టే.. గండికోట ఉత్సవాలు -2026 లకు ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా, బంధు మిత్రులతో తరలి రావాలని.. జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్, టూరిజం కౌన్సిల్ చైర్మన్ డా.శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు.

శనివారం కలెక్టరేట్ లోని విసి హాలులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో.. గండికోట ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని, అందరూ భాగస్వామ్యం కావాలని ఆహ్వానం పలుకుతూ.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

వైఎస్ఆర్ కడప జిల్లా చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా అత్యంత వైభవంగా కన్నుల పండుగ వాతావరణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గండికోట ఉత్సవాలు-2026 లను నిర్వహిస్తోంది. చారిత్రిక వైభవాన్ని చాటి చెప్పేలా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం గండికోట ఉత్సవాలు-2026 లను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ఈ ఉత్సవాలను అత్యంత ప్రాధాన్యతతో జనవరి 11, 12, 13వ తేదీల్లో మూడు రోజులపాటు పండుగ వాతావరణంలో వైభవంగా నిర్వహిస్తున్నాం. ఈ ఉత్సవాలలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో వివిధ ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకునేలా అన్ని కార్యక్రమాలను రూపొందించాం.

మొదటి రోజు (11-01-2026) కార్యక్రమాలు :

సాయంత్రం 4:00 - 5:30 గం.వరకు - శోభాయాత్ర

సాయంత్రం 5:30 గం.లకు - గండికోట ఉత్సవాలు-2026 ప్రారంభోత్సవం

సాయంత్రం 6:30 - 7:00 గం.వరకు - గండికోట వారసత్వం, ఘన చరిత్ర...ప్రముఖ సినీ గీత రచయిత శ్రీ జొన్నవిత్తుల

రామలింగేశ్వరరావు గేయాలాపన, చరిత్రకారులు శ్రీమతి డా. సగిలి సుధారాణి, శ్రీ తవ్వ ఓబుల్‌రెడ్డి ప్రసంగం

రాత్రి 7:10 - 7.20 గం. వరకు - గండికోట థీమ్ డ్యాన్స్

రాత్రి 7:20 - 7:35 గం. వరకు - థిల్లానా కూచిపూడి నృత్యం

రాత్రి 7:35 - 7:55 గం. వరకు - ముషాయిరా కవి సమ్మేళనం

రాత్రి 7:55 - 8:15 గం. వరకు - సౌండ్ ఔ లేజర్ లైట్ షో

రాత్రి 8:15 - 9:45 గం. వరకు - నేపథ్య గాయని మంగ్లీచే సంగీత కచేరీ

రాత్రి 9:45 - 10:00 గం. వరకు - స్కై లాంతర్ ఫెస్టివల్

2వ రోజు (12-01-2026) కార్యక్రమాలు :

ఉదయం 10:00 - మ.2:00 గం.వరకు - గైడెడ్ హెరిటేజ్ వాక్



అడ్వెంచర్ యాక్టివిటీస్ - హెలిరైడ్, పారామోటార్ గ్లైడింగ్ మొదలైనవి.

గ్రామీణ క్రీడా కార్యక్రమాలు - వ్యాలీబాల్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ,కవిత్వం, కథలు చెప్పడం, ఫోటోగ్రఫీ, స్కెచింగ్, పెయింటింగ్, వి.లాగింగ్, వంటల పోటీలు.

సాయంత్రం 4:00 - 5:00 గం. వరకు - కథా సదస్సు ఔ గండికోట వైభవంపై డీకే, చదువుల బాబు, పి.బాలాజీ, తవ్వా ఓబుల్ రెడ్డి, వై.మధుసూధన గారిచే ప్రసంగాలు.

సాయంత్రం 5:00 - 7:45 గం. వరకు - సాంస్కృతిక కార్యక్రమాలు,కూచిపూడి, బుర్రకథ, హరికథ, మ్యాజిక్ షో, అన్నమయ్య సంకీర్తనలు, తోలుబొమ్మలాట మొదలైనవి.

రాత్రి 7:45 - 8:15 గం. వరకు - సౌండ్, లైట్ ఔ లేజర్ షో

రాత్రి 8:15 - 9:45 గం. వరకు - రామ్ మిర్యాల చే మ్యూజికల్ నైట్ ప్రదర్శన

3వ రోజు (13-01-2026) కార్యక్రమాలు :

ఉదయం 10:00 - మ. 2:00 గం. వరకు - అడ్వెంచర్ యాక్టివిటీస్ - హెలిరైడ్, పారామోటార్ గ్లైడింగ్., కవిత్వం, కథ చెప్పడం, ఫోటోగ్రఫీ, స్కెచింగ్, పెయింటింగ్, వి.లాగింగ్, వంటల పోటీలు

సాయంత్రం 4:00 - 7:00 గం. వరకు - సాంస్కృతిక కార్యక్రమాలు, మిమిక్రి, జానపద గేయాలు, చెక్క భజన, క్లాసికల్ డాన్స్, యక్ష గానం, బృందావనం

సాయంత్రం 7:00 గంటలకు - సౌండ్, లైట్ ఔ లేజర్ షో

రాత్రి 7:20 - రాత్రి 9:00 గం. వరకు - శివమణి చే మ్యూజికల్ నైట్ ప్రదర్శన

రాత్రి 9:00 గంటలకు - ఫైర్ వర్క్స్

రాత్రి 9:05 - 9:30 గం. వరకు - గండికోట ఉత్సవాల ముగింపు వేడుక

గండికోట ఉత్సవాల నిర్వహణలో భాగంగా పర్యాటకులకు, సందర్శకులకు మరింత వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించే విధంగా ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ రకాలైన సాంస్కృతిక, సాహిత్య, సంప్రదాయ, సాహస క్రీడా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది.

మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా దాదాపు 15 నిమిషాల నిడివితో 270ళీ దృశ్య కోణంలో ఐమాక్స్ థియేటర్ కంటే అత్యంత అడ్వాన్స్ స్క్రీన్ అనుభూతితో గండికోట ఘన చరిత్రను తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించేందుకు ఉచిత దృశ్యశ్రవణ ( డోమ్ ను ఏర్పాటు చేయడం జరిగింది. 11వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

ప్రత్యేకించి యువతకు, చరిత్రకారులకు, కళాకారులు, చిత్రకారులు, సాహితీ ప్రియులు, కథకులు, రచయితలు, వాగ్గేయ కారులకు వారివారి అభిరుచులకు తగ్గట్టు చక్కటి కార్యక్రమాలను రూపకల్పన చేయడం జరిగింది.

అంతేకాకుండా సాంస్కృతిక, గ్రామీణ క్రీడలు, సాహస (అడ్వెంచర్) క్రీడలు, గండికోట పెన్నా నదీ లోయలో బోటింగ్, రోప్ వే, కోట పరిసర ప్రాంతాల్లో ట్రెక్కింగ్ వంటి సదుపాయాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి.

సందర్శకులకు గండికోట ప్రకృతి అందాల వీక్షణంతో పాటు ఉత్సాహవంతులైన వారిని ఉత్సవాల్లో కూడా భాగస్వామ్యం చేస్తూ ఫోటోగ్రఫీ, చిత్రలేఖనం, కథలు చెప్పడం, సంప్రదాయ క్రీడలు, సంప్రదాయ వంటరుచులు మొదలైన వివిధ రకాల పోటీలను కూడా నిర్వహించి చివరిరోజు బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుంది.

గండికోట చారిత్రక సౌరభాలను, చుట్టుపక్కల ప్రకృతి అందాలను, పర్యాటక విశేషాలను 360ళీ కోణంలో విహంగ వీక్షణం ద్వారా చూసేందుకు హెలికాప్టర్ ద్వారా ఒక్కొక్కరికి రూ.3000 చొప్పున ఛార్జీలతో హెలీరైడ్ సదుపాయాన్ని కల్పించడం జరిగింది. వీటితోపాటు ఎయిర్ బెలూన్, పారాచూట్ విహంగ పయనం ద్వారా కోట పరిసరాలు, ఎర్రమల కొండల అందాలు, మంద్రంగా ప్రవహించే పెన్నానదీ ప్రవాహం, మైలవరం, గండికోట రిజర్వాయర్ ల బ్యాక్ వాటర్ సోయగాలు, కొండలపై గాలి మరలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి.

మన కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గ్రామీణ చేతి వృత్తి కళాకారులు రూపొందించిన అనేక రకాలైన ఉత్పత్తులు, హ్యాండ్లూమ్స్, ఇలా అన్ని రకాలతో 25 సంప్రదాయ కళారూపాల ప్రదర్శన లతో పాటు గ్రామీణ రుచులతో 35 పిండి వంటల విక్రయ శాలలను కూడా ఏర్పాటు చేయడమైనది.

వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన వేదికలను ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ఉత్సవాలకు వచ్చే సందర్శకులకు స్థానిక రుచులతో పాటు వివిధ రకాలైన సాంప్రదాయ రుచులను అందించే ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేయడం జరిగింది.

సందర్శకులు రాత్రిపూట బస చేసే సౌకర్యం కల్పిస్తూ వివిధ రకాల సదుపాయాలతో టెంట్ హౌస్ లను ఏర్పాటు చేయడమైనది. సందర్శకులకు ఎలాంటి కొరత లేకుండా అన్ని రకాలైన రక్షణా ఏర్పాట్లను పటిష్టంగా ఏర్పాటు చేయడమైనది.

సందర్శకులకు వసతిలో ఎలాంటి కొరత లేకుండా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి నీరు, టెంపరరీ టాయిలెట్స్, పారిశుద్ధ్యం, రవాణా సదుపాయం, వెహికల్ పార్కింగ్ ఇలా అన్ని రకాల కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగింది.

జిల్లా సాంస్కృతిక చారిత్రక పర్యాటక వైభవాన్ని గండికోట గ్రాండ్ కెనాన్ వైభవాన్ని ప్రపంచ స్థాయిలో ఆకర్షించేలా ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా కార్యక్రమాలను రూపొందించడం జరిగింది.

మొట్టమొదటిసారి ఇలాంటి పర్యాటక శోభను గండికోటలో నిర్వహించడం జరుగుతుంది. కడప జిల్లా వాసులకు ఇది ఒక చక్కటి అవకాశంగా భావించి ఉత్సవాలు నిర్వహించే మూడు రోజుల్లో అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సందర్శకులు విరివిగా తరలిరావాలని కోరడమైనది.

ఈ ఉత్సవాలకు గండికోట పరిసర ప్రాంతాల స్థానికులు, రాష్ట్రేతర, జిల్లాయేతర పర్యాటకులు గండికోట ఉత్సవాలకు హాజరై మన వైఎస్ఆర్ కడప జిల్లా యంత్రాంగం తరపున ఇస్తున్న ఆతిథ్యాన్ని స్వీకరించి విజయవంతం చేయాలని కోరుతున్నామని జిల్లా కలెక్టర్ కోరారు.

# నిజాంపేట్, పేట్ బషీరాబాద్ లో అక్రమాలు

## -నిమ్మకాయల వంశీ శ్రీనివాస్ చట్టవ్యతిరేక చర్యలు!
## -కుట్రలు బట్టబయలు చేసిన సభ్యులు
## -సహకార శాఖ, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

హైదరాబాద్, జనవరి 10 : జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ




సీఈ, కార్యదర్శిగా సుదీర్ఘంగా కొనసాగుతున్న నిమ్మకాయల వంశీ శ్రీనివాస్ చట్ట వ్యతిరేక చర్యలను సభ్యులు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదికగా బట్టబయలు చేశారు. 2023 లో వంశీ శ్రీనివాస్ పై చార్జిషీటు, ఎన్నికల సంఘం ద్వారా కేసు నిజం కాదా? అని ప్రశ్నించారు. 2022 సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంలో లోగుట్టు ఏమిటి? వెయ్యి కుటుంబాల ప్రయోజనాలను ఫణంగా పెట్టి భూములను జేఎన్‌జేహెచ్ఎస్ సభ్యులు అనుభవించకుండా ఎందుకు కుట్రపన్నారని నిలదీశారు. ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా నిజాంపేట, పేట్ బషీరాబాద్ భూములు జేఎన్‌జేహెచ్ఎస్ మ్యాక్ సొసైటీ సభ్యులకు దక్కనివ్వకుండా కుట్రపన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ గందరగోళంలో నిజాంపేట్, పేట్ బషీరాబాద్ భూములను అక్రమమార్గంలో కొట్టివేయాలని కుట్రపన్నింది ఎవరు? వారికి బాసటగా నిలిచింది ఎవరు? చొరబాటుదారులకు మార్గం సుగమం చేసింది ఎవరు? తేల్చాలని ప్రభుత్వాన్ని సభ్యులు కోరారు. నిజాంపేట్ లో భోగీ కృష్ణ పేరిట మూడు ఎకరాలు, స్ట్రింగర్స్ పేరిట రెండు ఎకరాలు అక్రమణలు జరిగాయని ఆరోపించారు. పేట్ బషీరాబాద్ లో కబ్జాలు, మానేటి శ్రీనివాస్ రెండు వేల గజాలు ఆక్రమించి రెండంతస్తుల ఇళ్లు, అపర్ణ వెంచర్స్‌కు సోసైటీ భూమిలోంచి రోడ్డు, సెయింట్ ఆన్స్ పాఠశాల ఎకరంన్నర కబ్జా అంశాల్లో నిమ్మకాయల వంశీ పాత్ర అనుమానాస్పందంగా ఉందన్నారు. ప్రభుత్వ ఖజానాకు చెల్లించగా అలాట్ అయిన భూమి అన్యాక్రాంతమైతే ఎందుకు మీ మీడియాహౌజ్‌ల ద్వారా ఆ కబ్జాలను వెల్లడించలేదని, సాటి జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎందుకు బహిర్గతం చేయడం లేదని వాపోయారు. జర్నలిస్టు సంఘాలు కూడా ఈ విషయంలో నోరు మెదపడం లేదెందుకు? ఈ దోస్తీ ఏమిటి? చార్జీషీటు తర్వాత విచారణ ఏమైంది? కంప్లయింట్ దారులు కూడా ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఈ లోపాయికారీ ఒప్పందాలే తమకు శాపంగా మారాయన్నారు. చార్జ్ షీట్ నమోదై ఉన్న వ్యక్తికి ఓట్లేయమని పలు మీడియాల్లో కీలక స్థానాల్లో ఉన్నవారు ఎలా మెసేజ్ విడుదల చేశారు? అలా మెసేజ్ విడుదల చేసినందుకు గాను సొసైటీకి, సభ్యులకు జరిగిన అన్యాయానికి బాధ్యత వహిస్తారా? లేదా మీ పేర్లను మీ అనుమతి లేకుండా వంశీ శ్రీనివాస్ వాడుకున్నారా స్పష్టం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

సహకార శాఖ చర్యలు తీసుకోవాలి:

2014 నుంచి 2021 వరకు జేఎన్‌జే హెచ్ ఎస్ సోసైటీకి ఎన్నికలు జరగకున్నా, జరిగినట్లుగా కమిటీ వ్యవహరిస్తే సహకార శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం ఆడిట్ రిపోర్టులు , సభ్యుల వివరాలు ఎవరు పొందుపరిచారు? ఈ గందరగోళానికి కారణం అప్పటి ప్రభుత్వం, సంబంధిత ప్రభుత్వ శాఖలది కాదా? అన్నారు.

సుప్రీం కోర్టుకు ఎందుకు?

ఇళ్లులేని సోసైటీ సభ్యులు అఫిడవిట్లు ఇచ్చి భూములు తీసుకోవాలని 2010లో హైకోర్టు స్పష్టంగా పేర్కొన్నా, సభ్యులను సంప్రదించకుండా సుప్రీంకోర్టుకు వెళ్లారని సభ్యులు వాపోయారు. గవర్నమెంట్ మెమో నంబరు 19544 /ఏఎస్ఎస్ఎన్ 5(3) ? 2011, 04?01?2012 ద్వారా తమ సొసైటీ ప్రభుత్వానికి డబ్బులు కట్టిందన్నారు. ప్రభుత్వం ఐ అండ్ పీఆర్ శాఖ ద్వారా భూములను తమ సొసైటీకి స్వాధీన పరిచినా కూడా ఎందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ విరమించుకోలేదు? దీని వెనుక ఉన్న మర్మమేమిటో నిమ్మకాయల వంశీ చెప్పాలన్నారు.

సీఎం రేవంత్ కు కృతజ్ఞతలు

ఈ మొత్తం యవనికలో జేఎన్‌జేహెచ్ఎస్ సభ్యులను కాపాడుతున్న అంశం ఒకే ఒక్కటి. అది రాష్ట్ర ముఖ్యమంత్రి 2024, సెప్టెంబర్, ఎనిమిదవ తేదీన రవీంద్రభారతిలో భారీ సభ ఏర్పాటు చేసి పేట్ బషీరాబాద్ భూముల మీద అనుభవ హక్కులను ప్రసాదిస్తూ అధికారిక పత్రాన్ని విడుదల చేశారని సభ్యులు తెలిపారు. తమకు అండగా నిలిచిన కాంగ్రెస్ సర్కారుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు చెప్పారు.

# బద్వేలులో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని కోరుతూ ఆర్డీఓ కు ఏపీఎంఎఫ్ వినతి

భారతశక్తి ప్రతినిధి, కడప, జనవరి 10: ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ బద్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు ఆవుల కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు బద్వేల్ లో ప్రెస్ క్లబ్ కోసం స్థలాన్ని మంజూరు చేయాలని కోరుతూ స్థానిక కార్యాలయంలో ఆర్డిఓ చంద్రమోహన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిత్యం సమాజంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న జర్నలిస్టులకు బద్వేల్ లో కనీసం ప్రెస్ క్లబ్ కూడా లేకపోవడంతో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. వార్తా సేకరణల కోసం అనేక అవస్థలు పడుతున్న జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే అనేక దఫాలుగా అధికారులకు విన్నవించి ఉన్నామని తెలిపారు. ఆ మేరకు స్పందించిన ఆర్డిఓ చంద్రమోహన్ బద్వేల్ లో ప్రెస్ క్లబ్ ఏర్పాటు కోసం స్థలాన్ని తప్పనిసరిగా మంజూరు చేస్తామని ఏపీ ఎంఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. ఆమేరకు ప్రెస్ క్లబ్ ను ఏర్పాటు చేసుకోవడానికి



భవనం నిర్మాణం కోసం నిధులను కూడా సమకూర్చుకోవాలని అప్పుడే బద్వేల్లో ప్రెస్ క్లబ్ ఏర్పడి జర్నలిస్టులకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు దేవిరెడ్డి వెంకట సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రఘు రాములు, వర్కింగ్ సెక్రటరీ సురేష్ బాబు, సహాయ కార్యదర్శి ఏ. కిషోర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రహీమ్, రవికుమార్, చాంద్ బాషా, చీదెళ్ల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో గ్రామీణ భారతానిది కీలక పాత్ర: ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

## -గ్రామీణ జీవనోపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి 'వీబీ - జీ రామ్ జీ' దోహదం

విజయనగరం, జనవరి 10(భారత శక్తి):వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడంలో గ్రామాలను భాగస్వామ్యం చేసేందుకు కొత్తగా తెచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్" ఎంతో దోహదపడుతుందని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. విజయనగరంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (విజయవాడ) నిర్వహించిన మీడియా వర్క్‌షాప్ 'వార్తాలాప్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వికసిత్ భారత్ 2047 లక్ష్యాల సాధనకు ఈ చట్టం ఒక సమగ్ర మార్గమని ఆయన పేర్కొన్నారు. నూతన చట్టం ద్వారా ఒక ఆర్థిక ఏడాదిలో పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడం అతిపెద్ద మార్పు అని అన్నారు.వీబీ జీ రామ్ జీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తుల కల్పన, స్థానికులకు జీవనోపాధి కల్పించడంపై దృష్టి పెడుతుందని వివరించారు. ఈ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరాలంటే మీడియా ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని పాత్రికేయులను ఎంపీ అప్పలనాయుడు కోరారు.పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) విజయవాడ, డైరెక్టర్ జి. సురేష్ కుమార్ వార్తాలాప్ ఉద్దేశాలను వివరిస్తూ, ఈ పథకంలో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి, మీడియాకు మధ్య వారధిగా పీఐబీ పనిచేస్తోందని తెలిపారు. పని దినాల పెంపు, వ్యవసాయ సమయంలో ఇచ్చే జీవనోపాధి సెలవు వంటి అంశాలు లబ్ధిదారులకు, రైతులకు ఎంతో మేలు చేస్తాయన్నారు.ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ వై.వి.కె. షణ్ముఖ కుమార్ ఈ పథకంపై జిల్లా పాత్రికేయులకు సమగ్రమైన అవగాహన కల్పించారు.ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం అమలులో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న జిల్లాల్లో విజయనగరం ముందుందని వెల్లడించారు. కేవలం ఉపాధి కల్పన మాత్రమే



కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తుల కల్పనపై ఇప్పుడు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. లబ్ధిదారుల ఆదాయం పెంచటమే కాకుండా, అవినీతిని కట్టడి చేసేందుకు కృత్రిమ మేధ , జీపీఎస్ ఆధారిత జియో-ట్యాగింగ్ వంటి అధునాతన సాంకేతికతలను వినియోగిస్తున్నట్టు వివరించారు.ఈ వార్తాలాప్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ పాత్రికేయులు విజయనగరం వంటి వెనుకబడిన జిల్లాల నుంచి వలసలను అరికట్టడానికి పలు సూచనలు చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల మధ్య వనరుల పంపిణీలో అసమానతలు లేకుండా చట్టంలో నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఈ నూతన చట్టం కారణంగా ఇకపై వారానికోసారి చెల్లింపులు జరుగుతాయని, పని కల్పించడంలో విఫలమైతే నిరుద్యోగ భృతి తప్పనిసరి అని తెలిపారు. నీటి భద్రత, గ్రామీణ మౌలిక సదుపాయాలు, విపత్తు సన్నద్ధత వంటి అంశాలకు ఈ పథకంలో ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్, లీడ్ బ్యాంక్ అధికారులు వి.వి. రమణమూర్తి, అనిల్, డ్వామా పీడీ శ్రీమతి శారదా దేవి పాల్గొన్నారు.

# సినిమా

## డార్లింగ్ ఫ్యాన్స్ రచ్చ

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ది రాజా సాబ్ సినిమా భారీ అంచనాల మధ్య నిన్న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన విషయం తెలిసిందే. సినిమా కథ, స్క్రీన్‌ప్లే, టోన్ విషయంలో మిక్స్‌డ్ రివ్యూలు వస్తున్నాయి. ప్రభాస్‌ను చాలా కాలం తర్వాత ఎనర్జిటిక్, ఫుల్ జోష్‌తో చూసిన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల్లో కూడా 'ది రాజా సాబ్'కు అభిమానుల సందడి కనిపించింది. ఈ ఉత్సాహమే ఒడిశాలోని రాయగడ జిల్లాలో ఒక ప్రమాదకర పరిస్థితికి దారి తీసింది. హీరోని వెండితెరపై చూడగానే ఆనందంలో మునిగిపోయిన కొందరు అభిమానులు థియేటర్ లోపలే టపాసులు పేల్చారు. ఈ ఘటనతో ఒక్కసారిగా థియేటర్‌లో గందరగోళం నెలకొంది. టపాసులు పేల్చిన సమయంలో వచ్చిన నిప్పురవ్వలు స్క్రీన్ ముందు విసిరివేసిన పేపర్ ముక్కలపై పడటంతో మంటలు చెలరేగాయి. సమయస్ఫూర్తితో వ్యవహరించి వెంటనే మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



## షాహిద్ కపూర్ సరసన త్రిప్తి దిమ్రీ

యానిమల్ సినిమాలో జోయా పాత్రలో కనిపించి ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది త్రిప్తి దిమ్రీ. ఆ ఒక్క పాత్రే ఆమె కెరీర్‌ను టర్నింగ్ పాయింట్‌గా మార్చేసింది. ఆ తర్వాత వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోకపోయినా ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న స్పిరిట్ సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక కావడం ఆమె కెరీర్ మరో పెద్ద మైలురాయిగా మారింది. అదే విధంగా బాలీవుడ్‌లోనూ వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న త్రిప్తి.. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ ఓ రోమియోలో నటిస్తోంది. ఇందులో షాహిద్ కపూర్ హీరోగా కనిపించనుండగా, వీరిద్దరి మధ్య రొమాన్స్‌తో పాటు ఇంటెన్స్ సీన్స్ ఉండనున్నాయని సమాచారం. సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్న ఈ చిత్రంలో దిశా పటాని, విక్రాంత్ మస్సే, నానా పటేకర్ లాంటి స్టార్స్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే కానుకగా థియేటర్లలోకి రానుంది.

## రెట్రో లుక్

హిట్స్, ఫ్లాప్స్‌తో సంబంధం లేకుండా స్టార్ హీరోయిన్‌గా దూసుకెళ్తున్న బ్యూటీ శ్రీలీల. ప్రస్తుతం ఈ భామ శివ కార్తికేయన్ తో కలిసి నటిస్తున్న మూవీ పరాశక్తి. ఆకాశమే నీ హద్దురా, గురు వంటి చిత్రాలతో మంచి బ్లాక్ బస్టర్ విజయాలను తన ఖాతాలో వేసుకున్న ప్రముఖ లేడీ డైరెక్టర్ సుధా కొంగర రూపొందిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఇకపోతే ఈనెల 10న థియేటర్లలో ఈ మూవీ విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో గందరగోళం నెలకొంది. ఈనెల 23న ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. పరాశక్తి సినిమా ప్రమోషన్స్ లో భాగంగా తమిళనాడులో ఇటీవల జరిగిన ఓ ఈవెంట్ లో శ్రీలీల స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. రెట్రో లుక్ ను తలపిస్తూ.. బ్లాక్ శారీ, జడలో గులాబీ పువ్వుతో కనిపించి అభిమానులను మెస్మరైజ్ చేసింది. దీంతో శ్రీలీల అలనాటి హీరోయిన్లను తలపిస్తున్నారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీకి సంబంధించిన ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.







## వరుస సెలవులు.. ఈ వారం ఓటీటీలో వినోదాలను అస్సలు మిస్సవ్వొద్దు

సంక్రాంతి మొదలైంది. థియేటర్‌లో వరుసగా కొత్త సినిమాలు సందడి చేయడానికి సిద్ధమవుతున్నాయి. మరోవైపు ఓటీటీలోనూ అలరించే చిత్రాలు స్ట్రీమింగ్‌కు వచ్చాయి. మరి ఈ వారం వినోదాన్ని పంచుతున్న సినిమాలు/సిరీస్‌లేంటో చూసేయండి.




అగ్ర కథానాయకుడు బాలకృష్ణ కీలక పాత్రలో బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ 'అఖండ2: తాండవం'. సంక్రాంతి కానుకగా ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రంలో సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా తదితరులు నటించారు.




'ఈటీవీ విన్' ఒరిజినల్ వెబ్‌సిరీస్ 'కానిస్టేబుల్ కనకం' ఆగస్టులో విడుదలై, ప్రేక్షకులను విశేషంగా అలరించింది. దానికి కొనసాగింపుగా కానిస్టేబుల్ కనకం సీజన్2 ప్రస్తుతం ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తొలి భాగాన్ని మించిన ట్విస్ట్‌లు అలరిస్తున్నాయి.



స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయో చూపించడానికి సిద్ధమైంది 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ సీజన్ 2' సిరీస్. నిఖిల్ అద్వాణీ దర్శకత్వం వహించారు. సిద్ధాంత్ గుప్తా, చిరాగ్ వోరా, రాజేంద్ర చావ్లా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం సోనీలివ్ వేదికగా అందుబాటులోకి వచ్చింది.

*** ఓటీటీలో అలరించే మరికొన్ని చిత్రాలు/సిరీస్‌లు**



**నెట్‌ఫ్లిక్స్**
**దే దే ప్యార్‌దే 2 (మూవీ) హిందీ**
**జియో హాట్‌స్టార్**
**హీర్ ఎక్స్ (మూవీ) హిందీ**
**వెపన్స్ (మూవీ) ఇంగ్లీష్**
**ఏ థౌజెండ్ బ్లోస్ (వెబ్‌సిరీస్: సీజన్2) ఇంగ్లీష్**
**ట్రాన్: ఏరీస్ (మూవీ) ఇంగ్లీష్/తెలుగు**

## 'మన శంకరవరప్రసాద్ గారు' టికెట్ ధరల పెంపునకు తెలంగాణ గ్రీన్ సిగ్నల్..



'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో స్పెషల్ ప్రీమియర్‌తో పాటు, టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 11న స్పెషల్ ప్రీమియర్‌కు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ షో టికెట్ ధరను రూ.600గా (జీఎస్టీతో కలిపి) నిర్ణయించింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య షోను ప్రదర్శించాల్సి ఉంటుంది. జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని తెలుపుతూ జీవో జారీ చేసింది. ఈ చిత్రం టికెట్ ధరలు పెంచుకునేందుకు ఇప్పటికే ఏపీలో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అక్కడ స్పెషల్ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.500 కాగా (జీఎస్టీతో కలిపి).. సింగిల్ స్క్రీన్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.125 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పించింది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.



# స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్.. ఇలా ఫాలో అవ్వండి..

**స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్ ఎంతో ట్రెండీగా ఉంటుంది. స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్ పాటించే వారు ఎంతో కలర్ ఫుల్‌గా కనబడతారు. ఎప్పటికీ ఈ స్టైల్ కొత్తదిగానే ఉంటుంది. దీంట్లో ఎటువంటి రూల్స్ ఉండవు. కాబట్టి మీకు నచ్చిన విధంగా దుస్తులను ధరించవచ్చు.**

నిజానికి స్ట్రీట్ స్టైల్ ఫ్యాషన్ అనేది బ్రిటిష్ ఫ్యాషన్ నుండి వచ్చినది. ఈ ఫ్యాషన్ లో ఈ విధంగా డ్రెస్సింగ్ చేసుకోవాలి అని ఎక్కడ ఉండదు. స్వతహాగా ఎవరి ఇష్టానికి, ఆటిట్యూడ్‌కి తగ్గట్టు వారు డ్రెస్సింగ్ చేసుకోవచ్చు. మరియు ఇతర లేదా ప్రస్తుత ఫ్యాషన్ ట్రెండ్స్‌ను పట్టించుకోవాల్సిన అవసరం ఉండదు. ఇదే డ్రెస్సింగ్‌ను పర్సనల్ స్టైల్ అని కూడా అంటారు. అంటే ఎవరి వ్యక్తిగత ఎంపిక వారిది అని అర్థం. ఎంతో సింపుల్‌గా కనిపించే దుస్తులను ట్రెండీగా బాగా కనిపించేలా చేయడమే స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్ అంటే. రకరకాలుగా ప్రయత్నించి మీకు ఏ దుస్తులు నప్పుతాయో వాటిని ధరించండి. దుస్తులను జత చేసేటప్పుడు చాలా విధానాలను ప్రయత్నించి. ఏదైతే మీకు సరైంది మరియు అందంగా కనిపిస్తుందో దానిని పాటించండి . ఈ డ్రెస్సింగ్‌ను అలవాటు చేసుకోవడానికి ఎంతో సమయం పట్టదు. మీ సృజనాత్మకతను వాడి రిస్కు తీసుకునైనా సరే మీరు మంచి డ్రెస్సింగ్ చేసుకోండి. ఈ డ్రెస్సింగ్ మొత్తం మనం చేసే ప్రయత్నాలపై ఆధారపడి ఉంటుంది. దుస్తులను ఎంత బాగా జోడిస్తే ఎంతో ఫ్యాషన్‌గా కనబడతారు. మరి వాటిని ఎలా జోడించాలి? ఈ స్టెప్స్‌ను వాడితే ఎంతో సులువుగా స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్ చేసుకోవచ్చు. ఎంతో ట్రెండీగా కనబడొచ్చు. అయితే మరి ఎంతో ట్రెండీగా ఉండే ఈ స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్ గురించి మీతో ఇక్కడ పంచుకోవడం జరిగింది. మరి వాటి గురించి మీరు ఇప్పుడే అనేక విషయాలని తెలుసుకోండి. దీనితో మీరు మీ డ్రెస్‌ని సెలెక్ట్ చేసుకునేటప్పుడు కూడా ఇది బాగా ఉపయోగ పడుతుంది. అలానే ఎన్నో కొత్త విషయాలని కూడా మీరు దీని ద్వారా తెలుసుకోవచ్చు. మరి ఇంకా ఆలస్యం ఎందుకు ఇప్పుడే దీని కోసం పూర్తిగా తెలుసుకోండి.

### ఓవర్ సైజ్ ఫ్యాషన్ :

ఓవర్ సైజు దుస్తులను కొనాలనే ఆలోచన ఉంటే స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్ మీరు చేసుకోవచ్చు. ఓవర్ సైజ్ టీ షర్ట్ లేదా టాప్ ధరించి, స్కిన్ ఫిట్ ప్యాంటు ను ధరించాలి. అదే కొద్దిగా పొడవుగా ఉన్న టాప్ లేదా టీషర్ట్ ఉంటే ఫ్యాంట్ ధరించకుండా టాప్ కి తగినట్టు షూస్ ను ధరించాలి. ఇది ఎంతో ట్రెండీగా కనబడుతుంది. దానికి తగినట్టు హెయిర్ స్టైల్ కూడా చేసుకోవాలి. మరింత అందాన్ని తేవడానికి ఒక క్యాప్ ను కూడా ధరించవచ్చు. స్కిన్ ఫిట్ ఫ్యాంట్ కాకపోయినా ఫుల్ జీన్స్ ధరించ వచ్చు. ఇది కూడా స్టైలిష్ గా ఉంటుంది.

### జాకెట్ ధరించండి :

ఓవర్ సైజ్ దుస్తులు లేకపోతే దీనిని ప్రయత్నించండి. ఎటువంటి టీ షర్ట్ పైన లేదా టాప్ పైన భుజాలకు జాకెట్ వేసుకోండి. ఈ లుక్ కూడా చాలా బాగుంటుంది. కొద్దిగా ఓల్డ్ మెథడ్ అయినా కూడా ఎప్పుడు కొత్తగానే ఉంటుంది. ఇది ఎటువంటి సందర్భంలో అయినా మంచి లుక్‌ను ఇస్తుంది. కానీ టాప్ మరియు జాకెట్ రంగు మ్యాచ్ అయ్యేటట్టు చూసుకోండి. లేదంటే ఏ మాత్రం బాగోదు. కానీ కరెక్ట్ గా కనుక మీరు సెలెక్ట్ చేసుకున్నారంటే మాత్రం అవుట్ ఫిట్ మొత్తం చాలా అందంగా మరియు కలర్ ఫుల్‌గా కనిపిస్తుంది.

### దుస్తులు లోపల ఏదైనా ధరించండి :

ఎప్పుడూ ఒకే విధంగా వాడే ఫ్రాక్స్ లుక్‌ను మార్చడానికి లోపల ఒక టీ షర్ట్ వేసుకోండి. టీ షర్ట్‌కు బదులుగా షర్ట్ కూడా వేసుకోవచ్చు. వీటికితోడు షూస్, కలర్ ఫుల్ గ కనపడే బ్రాస్లెట్ వంటివి జత చేయొచ్చు. మీ స్కిన్ టోన్ బట్టి యాక్సెసరీస్ ను ఎంపిక చేసుకోవాలి. ఇలా జత చేసి డ్రెస్సింగ్ చేసుకుంటే ఎప్పుడూ కంటే కొత్తగా కనపడతారు. అంతే కాక మరింత అందంగా మరియు ట్రెండీగా కూడా ఉంటుంది.

### షర్ట్‌నీ లూస్ గా వదిలేయండి :

సాధారణంగా టీ షర్ట్ వేసుకొని పైన షర్ట్ వేసుకోవడం చేస్తారు, ఇలా చేసినప్పుడు బటన్స్ మొత్తం పెట్టడం మరియు పూర్తిగా టక్ చేసేస్తారు. స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్ చేసుకోవాలనుకుంటే షర్ట్ కు ఒక వైపు మాత్రమే కొద్దిగా టక్ చేసి ఇంకో వైపు మామూలుగా వదిలేయాలి. ఇలా చేస్తే అవుట్ ఫిట్ చాలా బాగా కనబడుతుంది. కొంచెం పొడవైన షర్ట్ అయినా సరే ఈ స్టైల్‌కు సెట్ అవుతుంది. ఈ ఫ్యాషన్‌ని ఫాలో అయినప్పుడు షర్ట్‌పై భాగంలో ఉండే బటన్స్‌ను పెట్టుకోకుండా ఉంటే చాలా స్టైలిష్‌గా ఉంటుంది. ఎటువంటి ప్యాంట్ అయినా ధరించవచ్చు. షర్టు వేసుకుంటే ఈ విధంగా కూడా ధరించవచ్చు. టీ షర్ట్ వేసుకొని దానిపైన షర్ట్ వేసుకోవాలి ఇలా చేసినప్పుడు బటన్స్ పెట్టకూడదు. సాధారణంగా ఈ పద్ధతిని మగవారు పాటిస్తారు. కానీ ఇది ఆడవారికి కూడా బాగుంటుంది. కానీ టీ షర్ట్ ఎక్కువ పొడవు ఉంటే మరీ అంత అందంగా ఉండదు.

### సింపుల్‌గా ఉండేటువంటి దుస్తులను ధరించండి :

ఎంత ఫ్యాషన్‌గా రెడీ అయినా బయటకు వెళ్లేటప్పుడు మీ నడవడిక బట్టి మీ లుక్ ఆధారపడి ఉంటుంది. ఎంతో సింపుల్‌గా ఉన్న బట్టలు ధరించిన ఎంతో కాన్ఫిడెంట్‌గా మంచి నడవడిక తో నడవాలి. దాంతో మీ డ్రెస్సింగ్ కు మరింత అందం చేకూరుతుంది. ప్రతి ఒక్కరు మిమ్మల్ని గమనిస్తారు. కాబట్టి ఈ విషయాల్లో జాగ్రత్తగా ఉంది మంచి ట్రెండీ ట్రెండీగా ఈ స్టైల్‌లో రెడీ.

**స్ట్రీట్ స్టైల్ ఫ్యాషన్ అనేది ట్రెండింగ్**

**స్ట్రీట్ స్టైల్ డ్రెస్సింగ్‌కి చాలా మంది ఫిదా**



# పిల్లల ఎదుగుదలకు ప్రొటీన్లు ఎందుకు అవసరమో తెలుసా?


**పిల్లల పూర్తి సమగ్ర అభివృద్ధికి సమతుల్య మరియు పోషకమైన ఆహారం అవసరం. వారికి ఇష్టమైన ఆహారపదార్థాల్లో అవసరమైన అన్ని పోషకాలు అందుతున్నాయా అనేది ప్రశ్నార్థకమే.**





కాబట్టి మన పిల్లలు సక్రమంగా, సజావుగా ఎదగాలంటే వారికి మంచి పౌష్టికాహారం అందించడం మన కర్తవ్యం. ముఖ్యంగా మిల్క్ పౌడర్లు లేదా అటువంటి పోషకాలను అందించగల ఇతర పరిపూరకరమైన ఆహారాలు వారికి అందించాలి. పిల్లల ఎదుగుదలలో ఇతర పోషకాల కంటే ప్రొటీన్లు ఎక్కువ పాత్ర పోషిస్తాయి.



శారీరక శ్రమ మరియు ప్రాముఖ్యత పిల్లలు సాధారణంగా మొదటి నుండి శారీరక శ్రమ లేదా పనిలో పాల్గొనాలి. ముఖ్యంగా డ్యాన్స్, స్కేటింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి వ్యాయామాలు చేయాలి. ఈ శిక్షణలు వారి శారీరక వికాసానికే కాకుండా మానసిక వికాసానికి కూడా దోహదపడతాయి. ప్రోటీన్ యొక్క ప్రాముఖ్యత యుక్త వయస్సు వచ్చే వరకు పిల్లల శరీరాన్ని దృఢంగా ఉంచేందుకు, పిల్లల మనస్సును దృఢంగా ఉంచేందుకు ప్రొటీన్ సహకరిస్తుంది. ముఖ్యంగా పిల్లలలో కణజాలం, కండరాలు, చర్మం మరియు ఎముకల పెరుగుదల మరియు బలోపేతంలో ప్రోటీన్ సహాయపడుతుంది. ఒకరి జీవితంలో ఇతర సీజన్ల కంటే బాల్యంలో ఎక్కువ ప్రోటీన్ అవసరం. 1 మరియు 3 సంవత్సరాల మధ్య పిల్లలకు రోజుకు 13 గ్రాముల ప్రోటీన్ అవసరం. 4 నుండి 8 సంవత్సరాల పిల్లలకు ప్రతిరోజూ 19 గ్రాముల ప్రోటీన్ అవసరం. 9 నుంచి 13 ఏళ్లలోపు పిల్లలకు రోజూ 34 గ్రాముల ప్రొటీన్ అవసరమని నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోని ZeoNutraలో ఈకామర్స్ CMOగా పనిచేస్తున్న ZeoNutra CMO ECommerce Yashna Garg చెప్పారు. అతను పిల్లల సమతుల్య అభివృద్ధి కోసం క్రింది సూచనలను కూడా అందజేస్తాడు ఆరోగ్యకరమైన కొవ్వుల ప్రాముఖ్యత పిల్లలకు ఇచ్చే ఆహారంలో ఆరోగ్య కరమైన కొవ్వులు సమృద్ధిగా ఉండాలి. దీని కోసం, పిల్లలకు కొవ్వు ఆమ్లాలు మరియు విటమిన్ ఇ అధికంగా ఉండే ఆలివ్, నట్స్, అవకాడోస్ మరియు సీఫుడ్ వంటి ఆహారాలు ఇవ్వవచ్చు. అలాగే పిల్లలకు పంచదార వేయకుండా మిల్క్ పౌడర్లు ఇస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఎందుకంటే పాలపొడిలో ఉండే తీపి పిల్లలకు మంచి ఎదుగుదలను అందిస్తుంది.




చివరగా ఈ రోజుల్లో, మన చిన్న పిల్లలు ఎక్కువ సమయం ల్యాప్ టాప్‌లు లేదా స్మార్ట్‌ఫోన్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల ముందు గడుపుతున్నారు. కాబట్టి వారి మెదడు ఎదుగుదలకు ఆటంకం ఏర్పడి నీరసంగా తయారవుతారు. కాబట్టి మీరు వారి మెదడుకు పదును పెట్టగల కార్యకలాపాలలో వారిని నిమగ్నం చేయవచ్చు. ఉదాహరణకు, వారిలో చదివే అలవాట్లను ప్రోత్సహించవచ్చు.



# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

ఎల్బీనగర్, జనవరి 10 (భారత శక్తి): మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి గఆదేశాల మేరకు, మల్కాజిగిరి ఉమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి టి. ఉషారాణి సూచనల మేరకు, మల్కాజిగిరి ఏహెచ్ టియు సభ్యులు ఎస్ఐలు రాములు, ఖలీల్, ఏఎస్ఐలు వెంకట్ స్వామి,రంగారెడ్డి, ఉమెన్ పీసీ రజిత అబ్దుల్లాపూర్మెట్ స్మైల్ టీం సభ్యులు ఆపరేషన్ స్మైల్ XII లో భాగంగా అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండని బాల, బాలికలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 ఏండ్ల లోపు వారిని పనిలో పెట్టుకోవడమంటే వారి హక్కులను హరించడమేనని, వారి విద్యా, ఆరోగ్య భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు వివరించారు. బాలల హక్కులపై అవగాహన లేని వ్యాపారస్తులు మైనర్ బాల,బాలికలను పనిలో పెట్టుకుంటే వెంటనే వారిని పనిలో నుండి తొలగించి వారి హక్కులను కాపాడాలని ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాలల హక్కుల విషయంలో విద్యా, వైద్యపరంగా ఆదుకోవడానికి ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయని వారు వివరించారు.ఇండ్లలో బాల, బాలికలతో పని చేయించుకునే యజమానులు కూడా వారిని స్వచ్ఛదంగా ప్రభుత్వ ఆశ్రమాలకు లేదా వారి తల్లిదండ్రులకు అప్పగించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఏహెచ్ టియు యస్ఐలు, వనస్థలిపురం స్మైల్ టీం సభ్యులు,అబ్దుల్లాపూర్ మెట్ పరిసర ప్రాంతాల వ్యాపారస్తులు, ప్రజలు పాల్గొన్నారు.






## సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం

- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ పరిధిలోని మధుర నగర్ వాసులు సి. రాజ్యలక్ష్మి గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేక కుటుంబ సభ్యులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,00,000/ ల సీఎం సహాయనిధి ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 2,00,000/ (రెండు లక్షల రూపాయలు ) CMRF LOC మంజూరి పత్రాలను బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదిరెడ్డి కి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రావు, ప్రశాంత్ రెడ్డి, కొలన్ విక్రమ్ రెడ్డి, నవీన్ కుమార్, రాజ్ సుర పాల్గొన్నారు.

## గణితంలో బి.శ్రీకళకు పీహెచ్.డీ.



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని బి.శ్రీకళ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ఒక గొట్టంలో కదలిక, సంకోచ ప్రాంత ప్రవాహాల యొక్క గణిత విశ్లేషణ, నమూనా రూపకల్పన'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.మారుతీప్రసాద్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ అధ్యయనం శారీరక వ్యవస్థలకు సంబంధించిన సంక్లిష్ట ద్రవ ప్రవాహాల గణిత నమూనాపై గణనీయమైన అంతర్దృష్టులను అందిస్తుందని తెలిపారు. ఈ పరిశోధన, రక్త ప్రవాహం, ఇతర జీవ రవాణా విధానాలకు అనువర్తనాలతో, ఎలాస్టిక్ గొట్టాలలోని సంకోచించిన ప్రాంతాల ద్వారా అలల వంటి కదలికతో జరిగే ద్రవ ప్రవాహంపై దృష్టి పెట్టిందన్నారు. ఈ అధ్యయనం నానోఫ్లూయిడ్లు, మైక్రోపోలార్ ద్రవాలు, జంట ఒత్తిడి ద్రవాలు, హెర్షెల్ బల్క్లీ ద్రవాలు వంటి వివిధ న్యూటన్ స్నిగ్ధత నియమాన్ని పాటించని ద్రవాలపై ఉష్ణ ప్రభావాలను పరిశీలిస్తుందని తెలిపారు. స్థిరత్వం, ఖచ్చితత్వాన్ని నిర్ధారించడానికి స్థాపించబడిన విశ్లేషణాత్మక పద్ధతులను ఉపయోగిస్తుందన్నారు.డాక్టర్ శ్రీకళ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ - గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## పద్మశాలి సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: సంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్,పద్మశాలి సంఘం నేతలతో కలసి ఆవిష్కరించారు. సంఘం ఐక్యతతో ముందుకు సాగుతూ యువతను ప్రోత్సహిస్తూ విద్య, ఉపాధి రంగాల్లో మరింత పురోగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు, సభ్యులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోల్తా కొడుతున్న రేవంత్ సర్కార్

- కాంగ్రెస్ పార్టీని అణగదొక్కిన జర్నలిస్ట్ సంఘాలకే రెడ్ కార్పెట్
- తెలంగాణలో జర్నలిస్టు సంఘాలు చాలా ఉన్న పిలిచింది మూడు సంఘాలు ఎందుకో.?
- గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఈ సంఘాలని నమ్ముకొని ప్రభుత్వాన్ని కోల్పోయింది..!
- తాజాగా రేవంత్ సర్కార్ అదే దారిలో ..!
- మీ ఎవరికీ బానిసలం కాదు. గులాంగిరీ చేయమని చెపుతున్న తెలంగాణా రాష్ట్ర జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (టి.ఎస్.జేఏసీ)
- అన్ని సంఘాలని పిలవాలన్న అవగాహనాలేని ఐ & పి.ఆర్ శాఖ



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: గత ప్రభుత్వంలో అక్కడేషన్ కార్డు జారీలో భారీగా అవకతవకలు జరగడానికి అప్పటి ప్రభుత్వానికి ఊడిగం చేసిన జర్నలిస్టు సంఘాలే అన్న విషయం అందరికీ తెలుసు..!అధికారం ఎక్కడుంటే అక్కడనే ఆ సంఘాలు తొత్తులుగా వ్యవహరిస్తూ వాళ్ళ స్వలాభం కోసం పాటుపడడం గత 3 దశాబ్దాలుగా సర్వసాధారణాంగా జరుగుతున్న ప్రక్రియ. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అక్రిడేషన్ కార్డుల వ్యవహారం నడుస్తున్న సమయంలో ప్రభుత్వం జేఏసీగా ఉన్న అన్ని సంఘాలను పిలవకుండా, కేవలం మూడు సంఘాలను పిలిచి మాట్లాడడంపై జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సంఘాలని ఏ ప్రతిపాదికన సమాచార శాఖ పిలిచిందో వాళ్లకే తెలియాలి. ప్రభుత్వానికి తొత్తుగా ఉన్నందుకు పిలిచారా..? లేక గత ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు పిలిచారా.? సభ్యులు ఎక్కువగా ఉన్నారని పిలిచారా.? లేక 'ఊసరవెల్లి'లా రంగులు మార్చే యూనియన్లు ఉన్నాయని పిలిచారా.? మరి సమాచార శాఖకి తెలియాలి. గత కెసిఆర్ ప్రభుత్వ వ్యతిరేకాలను ఎండగట్టి జైలు పాలైన అనేకమంది జర్నలిస్టులను యూనియన్లను పక్కన పెట్టేసి 'అప్పుడు జోల పాట పాడిన యూనియన్ల'ను రేవంత్ సర్కార్ దగ్గర తీయడం ఏమిటో.?

- నియంతను ఎదిరించి జైళ్ళకు వెళ్ళిన జర్నలిస్టుల పరిస్థితి ఏమిటి.?

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే గత ప్రభుత్వం హయంలో జైలుకు వెళ్లిన పాత్రికేయులకు ఏదో ఒరుగుతుందని అందరూ భావించారు. అది జరగలేదు సరి కదా.! నియంత పాలనలో గుడ్డలు ఉతికిన వారికే రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారు. తప్పులు సరిదిద్దుకో రేవంత్ రెడ్డి సార్.

- ప్రెస్ అకాడమీ చైర్మన్ పూర్తిగా విఫలం

ఇదో పెద్ద దౌర్భాగ్యం, ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటినుండి నేటి వరకు ఆయన జర్నలిస్టులకు చేసింది పూర్తిగా శూన్యం. మంచి చేయడం దేవుడెరుగు.! చెడు చేయడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన పార్టీ పత్రిక కోసం ఎంతకైనా దిగజారుతాడు. కొన్ని యూనియన్లనే ఆయన దత్తత తీసుకున్నట్టుగా వాటిని అన్నిటికీ ముందుకు పెట్టడం విడ్డూరంగా మారింది. గత కెసిఆర్ ప్రభుత్వంలో ఆ యూనియన్లను వ్యతిరేకించిన శ్రీనివాస్ రెడ్డి ఈరోజు వాటిని సంకలు పెట్టుకొని తిరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కనీస జర్నలిస్టు విలువలు కూడా తెలియని ఈయన ఈరోజు ప్రెస్ అకాడమీ చైర్మన్ గా ఉండడం తెలంగాణ జర్నలిస్టుల దౌర్భాగ్యంగానే చెప్పుకోవచ్చు.! ఒక్క జీవోని కూడా సక్రమంగా రిలీజ్ చేయించలేని ప్రెస్ అకాడమీ చైర్మన్ ఉండి కూడా ఎలాంటి ఉపయోగం లేదు. ఇక జర్నలిస్టుల సాధకబాధలు కష్టాలు ఆయనకు పట్టే ఆయన సంబంధించిన పత్రికలకు ఎన్ పానెల్ చేసుకోవడం స్వలాభం కోసం యాడ్స్ వేయించుకోవడం తప్ప చిన్న పత్రికల బాగుకోసం ఒక్కరోజు కూడా ఆయన పాటుపడ్డ దాఖలాలు లేవు. ఇలాంటి అనర్హుడిని ప్రెస్ అకాడమీ చైర్మన్ గా నిలబెట్టిన రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు.

# క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- క్రీడా పోటీలు అభినందనీయం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోటీలు



గుమ్మడిదల , భారత శక్తి ప్రతినిధి, జనవరి 10 : యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, ఆరోగ్యవంతమైన జీవనం, మనోధైర్యం, స్నేహభావం పెరుగుతాయని పేర్కొన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల క్రీడా ఆవరణలో సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కబడి, వాలీబాల్ క్రీడా పోటీలను ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ నేటితరం యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, శారీరక దృఢత్వానికి, సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించేందుకు దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అధికారికి రిషిపాల్, సిఐ రమణారెడ్డి, ఎస్సై లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, సద్ది విజయభాస్కర్ రెడ్డి , వెంకటేష్ గౌడ్, రాజేష్,హుస్సేన్, నరసింహారెడ్డి,కొమ్ము శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, వేణు, రాజశేఖర్, మురళి, దేవేందర్ రెడ్డి పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, మొగులయ్య, సదానంద రెడ్డి, సత్యనారాయణ, మోహన్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, వాసుదేవరెడ్డి, నరహరి, ఆంజనేయులు, గోపాల్ రుక్మారెడ్డి అశోక్, మురళి, రాజు, ఏ కృష్ణ,విష్ణువర్ధన్ రెడ్డి, కులసంఘాల నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# కోడిపందాలు, పేకాట రాయుళ్ల పై ఉక్కుపాదం

- ఎస్పీ రోహిత్ రాజు
- జిల్లాలోని సరిహద్దు పోలీస్ స్టేషన్ల పరిధిలో పటిష్టమైన నిఘా.



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 10 (భారతశక్తి): పేకాట, కోడిపందాలు నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం తన కార్యాలయం నుండి ఒక ప్రకటనను విడుదల చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిరంతర వాహన తనిఖీలు, సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించబడిన కొన్ని ప్రదేశాలలో గస్తీని ముమ్మరం చేయడం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్,ఛత్తీస్గఢ్ రాష్ట్రాల సరిహద్దుగా గల జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. పట్టుబడిన నిందితులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులందరికి ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు.

# జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే ఇలాంటి ప్రచారం చేయరు: సీఎం చంద్రబాబు

అమరావతి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు నాగరికత గురించి తెలిస్తే నదుల గురించి ఇలా దుష్ప్రచారం చేయరని, అసలు సింధు నాగరికత ఎలా ఏర్పడిందో తెలుసుకుంటే మంచిదని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలైన దేశ రాజధాని దిల్లీ, లండన్ వంటివన్నీ నదీ తీరాల వెంబడే అభివృద్ధి చెందాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నదీ గర్భం, నదీ పరివాహక ప్రాంతంకు కనీస తేడా తెలియకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమకు బుద్ధి చెప్పినా రాజధాని విషయంలో ఇప్పటికీ విషం చిమ్మడం మానలేదని విమర్శించారు. శనివారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన చంద్రబాబు, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. నీటి విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు పడితే అంతిమంగా నష్టపోయేది తెలుగు ప్రజలేనని చంద్రబాబు స్పష్టం చేశారు. "రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుంది? తెలంగాణతో కలిసి సహకరించుకుని మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయి" అని సూచించారు. నీటిని సమర్థవంతంగా వాడుకోవడం వల్లే రాయలసీమ స్వరూపం మారిందని, పట్టిసీమ ప్రాజెక్టు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ఫలితంగానే రాయలసీమలో ఉద్యాన విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం దేశంలోనే ఉద్యాన (హార్టికల్చర్) రంగంలో ఏపీ మొదటి స్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కేవలం స్వార్థ రాజకీయాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఆపేసిందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 2020లో కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్ల బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో నీటి విషయంలో రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత అనేదే లేకుండా చూసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

## నారా భువనేశ్వరికి
# మరో విశిష్ట పురస్కారం...

అమరావతి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా భువనేశ్వరిపై ప్రశంసలు కురిపించారు. ఆమెకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాడి రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం భువనేశ్వరి చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పురస్కారం ఆమెకు, ఆమె బృందానికి దక్కాల్సిన సరైన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ గౌరవం వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతుల కృషి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ (సౌత్ జోన్) నారా భువనేశ్వరికి 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్' అవార్డును ప్రకటించింది. డెయిరీ రంగంలో ఆమె అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డు అందుకోవడంపై భువనేశ్వరి స్పందించారు. తనకు ఈ గౌరవాన్ని అందించిన ఇండియన్ డెయిరీ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. భారత డెయిరీ రంగం అభివృద్ధి, శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని ఆమె మరోసారి స్పష్టం చేశారు.

## మియాపూర్ లో రూ.3 వేల కోట్లకు పైగా
# విలువైన భూమికి హైడ్రా రక్షణ

మియాపూర్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. శేరిలింగంపల్లి మండలం, మక్తా మహబూబ్‌పేటలోని సర్వే నంబర్ 44లో ఉన్న సుమారు రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి కబ్జాకు గురవుతోందని గతంలోనే హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు గతంలోనే ఐదు ఎకరాలను స్వాధీనం చేసుకుని, చెరువు కట్టపై నిర్మించిన 18 అక్రమ షెట్టర్లను తొలగించారు. అయితే, ఇదే భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు గురయ్యారనే వార్తల నేపథ్యంలో హైడ్రా అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. ఈ విచారణలో, సర్వే నంబర్ 159కి చెందిన పత్రాలను ఉపయోగించి సర్వే నంబర్ 44లోని మొత్తం 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఎకరంన్నర భూమిని కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తాజాగా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిన హైడ్రా, ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేసింది.

# టికెట్ ధరలు అడ్డగోలుగా పెంచితే కఠిన చర్యలు..

అమరావతి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: సంక్రాంతి పండుగ రద్దీని ఆసరాగా తీసుకుని ప్రయాణికులను నిలువు దోపిడీ చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులను ఏపీ రవాణా శాఖ హెచ్చరించింది. టికెట్ ధరల పెంపు విషయంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించవద్దని, ఆర్టీసీ ఛార్జీలకన్నా 50 శాతం గరిష్ఠంగా పెంచుకోవచ్చని తెలిపింది. అంతకుమించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా పేర్కొన్నారు. ధరల పెంపునకు సంబంధించి నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 18 వరకు అన్ని జిల్లాల్లో నిత్యం తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభి బస్, రెడ్ బస్ వంటి యాప్‌ల ద్వారా కూడా ఆయా ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు ఎంత టికెట్ ధరలు వసూలు చేస్తున్నాయో పర్యవేక్షిస్తున్నామని, అధిక ధరలు ఉంటే కేసులు పెడతామని చెప్పారు. అధిక ధరలు వసూలు చేస్తే ప్రయాణికులు ఫిర్యాదు చేసేందుకు హెల్ప్‌లైన్ నంబరు 9281607001ను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెంబర్ ను అన్ని బస్సుల్లో డిస్ ప్లే చేసేలా ట్రావెల్స్ యజమానులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు.

# ఒడిశాలో కూలిపోయిన చార్టర్డ్ విమానం

ఒడిశా, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: ఒడిశాలో చార్టర్డ్ విమానం కూలిపోయింది. రూర్కెలా నుంచి భువనేశ్వర్‌కు ప్రయాణిస్తున్న తొమ్మిది సీట్ల విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికి ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటన జరిగిన సమయంలో విమానంలో పైలట్‌తో సహా మొత్తం ఏడుగురు వ్యక్తులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులకూ గాయాలు కాగా, వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సుందర్‌గఢ్ జిల్లాలోని కన్సార్ ప్రాంతంలో ఈ చార్టర్డ్ విమానం కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా నిర్ధారణ కాలేదు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# అయోధ్యలో కఠిన నిబంధనలు.. నాన్‌వెజ్ ఫుడ్ డెలివరీపై నిషేధం

అయోధ్య, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: రామ మందిరానికి 15 కిలోమీటర్ల పరిధిలో మాంసాహార (నాన్‌వెజ్) పదార్థాల ఆన్‌లైన్ డెలివరీని అయోధ్య యంత్రాంగం నిషేధించింది. ఈ మేరకు తాజాగా కఠినమైన ఉత్తర్వులు జారీ చేసింది. పవిత్ర పుణ్యక్షేత్రంగా భావించే 'పంచకోశి పరిక్రమ' పరిధిలోని ప్రాంతాల్లోకి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు మాంసాహారాన్ని సరఫరా చేస్తున్నాయని పదేపదే ఫిర్యాదులు రావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయోధ్యలోని కొన్ని హోటళ్లు, హోమ్‌స్టేలు అతిథులకు మాంసాహారంతో పాటు మద్యం కూడా అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని వాటి యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశామని అధికారులు తెలిపారు. నిషేధం ఉన్నప్పటికీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పర్యాటకులకు నాన్‌వెజ్ ఫుడ్ అందుతోందని ఫిర్యాదులు వచ్చినట్లు అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ మాణిక్ చంద్ర సింగ్ ధ్రువీకరించారు. "ఈ ఫిర్యాదుల నేపథ్యంలోనే ఆన్‌లైన్ నాన్‌వెజ్ ఫుడ్ డెలివరీపై నిషేధం విధించాం. హోటళ్లు, దుకాణదారులు, డెలివరీ కంపెనీలన్నింటికీ సమాచారం ఇచ్చాం. నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు. అయోధ్య, ఫైజాబాద్‌లను కలిపే 14 కిలోమీటర్ల రామ్ పథ్ మార్గంలో మద్యం, మాంసం అమ్మకాలను నిషేధిస్తూ 2025 మే నెలలో అయోధ్య మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకుంది. మాంసం దుకాణాలను తొలగించినప్పటికీ, మద్యం అమ్మకాలపై నిషేధం మాత్రం తొమ్మిది నెలలుగా సరిగా అమలు కావడం లేదని, ఈ మార్గంలో రెండు డజన్లకు పైగా మద్యం దుకాణాలు ఇంకా నడుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అయితే, మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలంటే జిల్లా యంత్రాంగం అనుమతి తప్పనిసరి అని ఓ మున్సిపల్ అధికారి పేర్కొన్నారు.

## శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్...
# పనుల తీరుపై మంత్రి నారా లోకేశ్ స్పందన

అమరావతి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ (LG) ఏర్పాటు చేస్తున్న భారీ తయారీ ప్లాంట్ పనులు శరవేగంగా సాగుతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రూ.5,000 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పురోగతిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు, యువతకు ఉద్యోగ కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందని చెప్పడానికి ఈ ప్రాజెక్టే నిదర్శనమని పేర్కొన్నారు. 247 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రపంచ స్థాయి తయారీ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది మే 2025లో ఈ ప్రాజెక్టుకు భూమిని అప్పగించగా, అతి తక్కువ సమయంలోనే నిర్మాణ పనుల్లో గణనీయమైన పురోగతి సాధించడంపై లోకేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌లో ఎల్జీ ఏర్పాటు చేస్తున్న మూడో ప్లాంట్ ఇది. ఈ యూనిట్‌లో రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లతో పాటు కీలకమైన విడిభాగాలను కూడా ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో తయారీ రంగ పర్యావరణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రణాళిక ప్రకారం 2026 చివరి నాటికి ఈ ప్లాంట్‌లో ఉత్పత్తిని ప్రారంభించి, 2029 వరకు దశలవారీగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషదాయకం

* టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 10 : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ఆనందంగా ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. శనివారం సదాశివపేట పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో తాను 3,500 ఇళ్ల పట్టాలు ఇస్తే టిఆర్ఎస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని విమర్శించారు. 2013లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో సదాశివపేట పట్టణంలో 122 ఎకరాలలో ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మూడు లక్షల ఎకరాకు చొప్పున భూమి ఇచ్చి 222 మంది రైతులకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి కాగా సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. అప్పటి సమయంలో కబ్జాలోకి రావాలని చెప్పిన వినలేదన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్లాట్ ల వద్దకు పట్టాదారులు వస్తే పోలీసులతో బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారు. పవర్ లేకపోవడంతో ఏమి చేయలేకపోయానని అన్నారు. ఇక ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో మాజీ మంత్రి హరీష్ రావు పై విమర్శలు చేశారు. సదాశివపేట పట్టణానికి చెందిన లీడర్తో కలిసి హరీష్ రావు చేసిన తప్పిదానికి 1080 ఎకరాలకు బదులు కేవలం 88 ఎకరాలు మిగిల్చారని ఎద్దేవా చేశారు. 88 ఎకరాల్లో స్కూలుకు దవఖానకు మూడు మతాల ఆలయాలకు కేటాయించగా, 36 ఎకరాలు మిగిలిందన్నారు. 2011 మందికి ఇక్కడ భర్తీ చేసే అవకాశం ఉందని కేవలం సదాశివపేట పట్టణానికి చెందిన వారికి మాత్రమే ఇస్తామన్నారు. ఇంకా మిగిలిన వాళ్ళకి ఇళ్ల స్థలాలు కావాలంటే 100 ఎకరాలు కావాలన్నారు. 2011 మందికి ఇచ్చిన పిమట వెంకటాపూర్ నిజాంపూర్ రోడ్లో మిగతా వారికి ఇస్తామన్నారు. ఇక టౌన్ లో 60 70 గజాల్లో ప్లాట్ ఉంటే ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామన్నారు. ఇందిరమ్మ ఇల్లు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వాళ్లు 20వ తేదీ తర్వాత మున్సిపల్ కమిషనర్ కు దరఖాస్తులు అందించాలన్నారు. పదేళ్ల కోరిక పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడమే ఆనందానికి కారణమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అర్హులైన లబ్ధిదారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాటలతో వినకపోతే బలప్రయోగమే..

అమెరికా, జనవరి 10: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్కిటిక్ ప్రాంతంలోని గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు బలప్రయోగానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. డెన్మార్క్‌కు చెందిన ఈ స్వయంప్రతిపత్తి గల ద్వీపంపై ఆ దేశ సార్వభౌమత్వాన్ని ఆయన తోసిపుచ్చారు. నిన్న వైట్‌హౌస్‌లో చమురు సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "డెన్మార్క్‌కు నచ్చినా నచ్చకపోయినా, గ్రీన్‌ల్యాండ్ విషయంలో మేం ఏదో ఒకటి చేయబోతున్నాం. సులభమైన మార్గంలో ఒప్పందం చేసుకోవడానికే నేను ఇష్టపడతాను. కానీ, ఆ మార్గంలో పని జరగకపోతే, కఠినమైన మార్గాన్ని ఎంచుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు. ఆర్కిటిక్‌లో రష్యా, చైనాల సైనిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని, అమెరికా జాతీయ భద్రతకు గ్రీన్‌ల్యాండ్‌ను నియంత్రించడం చాలా కీలకమని ఆయన అన్నారు. "మనం ఏమీ చేయకపోతే రష్యా లేదా చైనా గ్రీన్‌ల్యాండ్‌ను ఆక్రమిస్తాయి. దానిని మేం జరగనివ్వం. అందుకే మంచిమాటలతో లేదా మరో కఠిన మార్గంలోనో గ్రీన్‌ల్యాండ్‌తో ఏదో ఒకటి చేస్తాం" అని ట్రంప్ వివరించారు. ట్రంప్ బెదిరింపులపై డెన్మార్క్, ఇతర యూరప్ దేశాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. గ్రీన్‌ల్యాండ్‌పై దాడి జరిగితే నాటో సహా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన భద్రతా వ్యవస్థ మొత్తం కూలిపోతుందని డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడెరిక్సెన్ హెచ్చరించారు. అయితే, ఈ ఆందోళనలను ట్రంప్ తేలిగ్గా తీసుకున్నారు. "500 ఏళ్ల క్రితం వాళ్ల పడవ అక్కడికి చేరినంత మాత్రాన ఆ భూమి వాళ్లది అయిపోదు కదా" అని వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై చర్చించేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వచ్చే వారం డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు.

# NH65పై రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం

* డెక్కన్ టోల్ ప్లాజా లిమిటెడ్ ఆధ్వర్యంలో వాహనదారులకు విస్తృత ప్రచారం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 10: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా డెక్కన్ టోల్ ప్లాజా లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ రహదారి-65పై ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారుల కోసం విస్తృత స్థాయిలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతపై



అవగాహన కల్పించారు. ముఖ్యంగా హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా వివరించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు ఫ్లయర్లు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. అలాగే రాత్రి వేళల్లో వాహనాలు స్పష్టంగా కనిపించేలా మూడు చక్రాల ఆటోలు, ట్రక్కుల వెనుక భాగాలకు రెట్రోరిఫ్లెక్టివ్ టేప్‌ను అమర్చారు. ఇది రోడ్డు ప్రమాదాలను నివారించడంలో కీలకంగా ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారి నరేందర్ పాల్గొని, రోడ్డు భద్రతకు సంబంధించిన విలువైన సూచనలు అందించారు.డీటీపీఎల్ సిబ్బంది సమన్వయంతో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం రహదారులను మరింత సురక్షితంగా మార్చే దిశగా తీసుకున్న కీలక ముందడుగుగా నిలుస్తుంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని డీటీపీఎల్ ప్రతినిధులు వెల్లడించారు.

# జీఎన్ఆర్ చైతన్య హై స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

ఎల్బీనగర్, జనవరి 10 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్ పరిధిలోని సత్యనారాయణపురం కాలనీలోని జీఎన్ఆర్ చైతన్య హై స్కూల్ లో సంక్రాంతి పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత ఉత్సాహంగా,సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణం అంతా రంగురంగుల ముగ్గులు, మామిడి తోరణాలు, చెరకు గడలు, హరిదాసు-గంగిరెద్దుల ప్రతిరూపాలతో పండుగ శోభను సంతరించుకుంది.ఈ సంక్రాంతి వేడుకలు విద్యార్థులకు మన సంప్రదాయాలపై అవగాహన పెంచడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి.ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వేష ధారణలో ఆకట్టుకున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల ప్రాధాన్యతను తెలియజేసే కార్యక్రమాలు, జానపద నృత్యాలు, పాటలు, గాలి పటాల ప్రదర్శనలతో వేడుకలు సందడిగా సాగాయి.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల చైర్మన్ జి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, “సంక్రాంతి అనేది కేవలం పండుగ మాత్రమే కాదు, రైతుల కష్టానికి గౌరవం తెలిపే మహత్తర సందర్భం. మన సంస్కృతి, సంప్రదాయాలు విద్యార్థులకు



తెలియజేయడం ప్రతి విద్యా సంస్థ యొక్క బాధ్యత. ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, క్రమశిక్షణ, సాంస్కృతిక విలువలు పెంపొందుతాయి. జీఎన్ఆర్ చైతన్య హై స్కూల్‌లో విద్యతో పాటు సంస్కారాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నాము” అని తెలిపారు.ఈ సంక్రాంతి వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్, డీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తల్లిదండ్రుల పాల్గొనడం ద్వారా పాఠశాల-కుటుంబ అనుబంధం మరింత బలపడింది.



**నాగోల్ డివిజన్ పరిధిలోని సమతాపురి కాలనీలో నూతనంగా నెలకొల్పిన కేఫ్ లియోరా, పీకిల్ బాల్ ను ప్రారంభించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. తదనంతరం ఐ న్యూస్ 2026 నూతన క్యాలెండర్ ను మీడియా జర్నలిస్ట్ రిషికారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతుల రాజిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ పవన్ కుమార్, తూర్పాటి చిరంజీవి, చంద్రశేఖర్ రెడ్డి, రవి ముదిరాజ్, కేఫ్ నిర్వాహకులు భరత్ భూషణ్ రెడ్డి,అఖిల్ రెడ్డి, అభినయ్,మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.**

**ఎల్బీనగర్, జనవరి 10 (భారత శక్తి ):**

## పోలీస్ స్టేషన్ పని తీరును పరిశీలించిన సిపి అవినాష్ మహంతి

ఎల్బీనగర్, జనవరి 10 (భారత శక్తి): ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌ను మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టిన సీపీ,ఎల్బీనగర్ పోలీస్ అధికారుల, సిబ్బంది పనితీరు, రికార్డులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్బీనగర్ ఏసిపి కార్యాలయం, మల్కాజ్గిరి రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను పరిశీలించారు. ఎల్బీనగర్ రింగ్ రోడ్ లోని ట్రాఫిక్ సమస్యలను ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్ చౌరస్తాలో గజిబిజిగా ఉన్న ట్రాఫిక్ సమస్యను గమనించి, తీసుకోవల్సిన జాగ్రత్తలు ట్రాఫిక్ పోలీసులకు తెలిపారు. సంక్రాంతి పండుగ



సందర్భంగా ఊర్లకు బయలుదేరిన ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ట్రాఫిక్ విభాగం ఏసీపీ నవీన్ కుమార్ రెడ్డి,ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు వివిధ శాఖల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఏకరూప పన్నులు అమలు చేయండి

- **శివారు మున్సిపాలిటీలకు ఉచిత 20 వేల లీటర్ల మంచినీరు ఎప్పుడు ఇస్తారు..?**
- **మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి.**

ఎల్బీనగర్, జనవరి 10 (భారత శక్తి): ఈ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచితంగా డివిజన్లను విభజించి చేతులు దులుపుకున్నారని, కాలనీల విభజన అస్తవ్యస్తంగా జరిగిందని , కొత్తగా ఏర్పాటైన డివిజన్లలో ఏకరూప పన్నుల విధానాన్ని అమలు చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.ఆర్కేపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అధ్యక్షతన గ్రీన్ హిల్స్ కాలనీలోని భారాస పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశానికి సబిత ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, డివిజన్ల విభజన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం శివారు ప్రాంతాల కాలనీవాసులకు ఉచిత మంచినీరు ఎప్పుడు అందిస్తారని అన్నారు. ఉద్యమ కారులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని, స్వార్ధం కోసం కేసీఆర్ ఎప్పుడూ పనిచేయలేదని అన్నారు. కేసీఆర్ ను అవమానించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని, దానికి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. డివిజన్ల విభజన సరిగా లేదని, ప్రభుత్వం ఎన్ని



కుట్రలు చేసినా బిఆర్ఎస్ గెలుపును కేసీఆర్ కు కానుకగా ఇవ్వాలని అన్నారు. ఎన్టీఆర్ నగర్ డివిజన్ ఏర్పాటు పట్ల తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇద్దరూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారని డివిజన్ల విభజనలో కాంగ్రెస్ పార్టీతో పాటు ఇంకొక జాతీయ పార్టీ నాయకులు కలిసి కుట్రలు చేస్తుందన్నారు. మొత్తం జీహెచ్ఎంసీ పరిధిలో పన్నులు ఒకే విధంగా ఉండాలని అన్నారు. 20 వేల లీటర్ల నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు చెప్పను, ఇచ్చిన మాట అమలు చేస్తానని, ఏమైనా బిఆర్ఎస్ గెలుపుతోనే కాంగ్రెస్ కు జవాబు చెప్పాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మన ప్రభుత్వం వస్తుందని ధీమా వక్యం చేశారు. మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ మాట్లాడుతూ, నాయకులు కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసే కాంగ్రెస్, బిజెపి ఇద్దరు శత్రువులను తరిమికొట్టాలన్నారు. ఎక్కువ మంది ఉద్యమకారులు ఉన్న డివిజన్ లో పార్టీ బలంగా ఉందన్నారు. అందరూ కలిసి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, టికెట్ ఎవరికీ వచ్చినా పని చేసి బిఆర్ఎస్ జండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, మాజీ ఎంపీపీ జిల్లెల కృష్ణారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, ఊర్మిళారెడ్డి, రామాచారి, కొండ్రు శ్రీనివాస్, సాజీద్, రామ్ నరసింహ గౌడ్, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఎండి.జాహీద్, శ్యామ్ సుందర్ గుప్తా, యుగంధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు పోస్టులు పెడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి..

ఎల్బీనగర్, జనవరి 10 (భారత శక్తి): సామాజిక మాధ్యమాల్లో తమపై తప్పుడు రాతలతో పోస్టులు చేస్తున్నారని రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పిఏ తోట సతీష్ శనివారం సరూర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం నవయువ తెలంగాణ, బీజేవైఎం యువ పేరుతో ఫేస్ బుక్, వాట్సాప్ గ్రూపులలో పోస్ట్ చేశారని తోట సతీష్ శుక్రవారం మొదట తెలంగాణ సైబర్ సెక్యూరిటీ సర్వీసెస్ డైరెక్టర్ శిఖా గోయల్ ను సంప్రదించగా వారి సూచన మేరకు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ సీఐ సైదిరెడ్డికి ఫిర్యాదు చేశారు. తనతో పాటు మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శ్రీనుబాబుపై గుర్తు తెలియని వ్యక్తులు అసత్య ప్రచారం చేస్తున్నారని దీని వల్ల మేము సమాజంలో అప్రతిష్ట పాలవుతున్నామని మంత్రి పిఏ సతీష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు




నమోదు చేసి దర్యాప్తు జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సైదిరెడ్డి తెలిపారు.

## జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని నిరుద్యోగుల నిరసన



ఎల్బీనగర్, జనవరి 10 (భారత శక్తి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి సంవత్సరంలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి, ప్రభుత్వం రాగానే నిరుద్యోగులను మోసం చేశారని నిరుద్యోగులు ఆరోపించారు.జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని దిల్ సుఖ్ నగర్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు. పోలీసులు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు. కాంగ్రెస్ మంత్రులు ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందని,కాంగ్రెస్ గవర్నమెంట్ నోటిఫికేషన్ వేయకుండా ఉద్యోగాలు ఎట్లా ఇచ్చిందని, గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుని గప్పాలు కొడుతోందని విమర్శించారు.




## గండి సన్నీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

- **విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

ఎల్బీనగర్, జనవరి 10 (భారత శక్తి): సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ భారాస పార్టీ యువ నాయకులు గండి సన్నీ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం గౌతమి నగర్ కాలనీలోని శ్రీసాయి గ్రామర్ స్కూల్ వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో భాగంగా ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ముందుగా గంగిరెద్దుల విన్యాసాలు అనంతరం చిన్నారుల హరి రామ దాసులు వేషాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ముందస్తుగా తెలుగు రాష్ట్ర ప్రజలకు భోగి,సంక్రాంతి,కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల జీవితంలో నిత్యం కాంతులు విరిసిల్లేలా ఆనందంగా గడపాలని కోరారు. ప్రజలంతా సంతోషంగా ఈ పండుగ జరుపుకోవాలని అన్నారు.ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభ్రాతృత్వం, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బిచేనేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్,కిరణ్ కుమార్, పటేల్ రమణారెడ్డి, రవీందర్ రెడ్డి, విజయలక్ష్మి, వాణి, శిరీష, చంద్రశేఖర్ యాదవ్ పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.